**విలేకరులు కావలెను**
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ **సారథి**
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక




**టీవీ రిపోర్టర్లు కావలెను**
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 19-07-2025 | సంపుటి : 11 | సంచిక : 169 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# న్యూజిలాండ్ జనాభాకు మించి బిహార్‌కు ఇళ్లిచ్చాం: మోదీ



మోతిహారి: బిహార్ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మోతిహారిలో బుధవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, ఈరోజు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తుండటం తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో ఉన్న జనాభాకు మించి బిహార్ ప్రజలకు ఇళ్లు ఇచ్చామని తెలిపారు.'ఇది చంపారణ్ చారిత్రక గడ్డ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఇక్కడి నుంచే గాంధీజీ ఒక కొత్త మార్గాన్ని నిర్దేశించారు. ఆ స్ఫూర్తితోనే ఇక్కడి నుంచి బిహార్‌కు సరికొత్త భవిష్యత్తును నిర్దేశించనున్నాం' అని మోదీ అన్నారు. ప్రపంచం వేగంగా 21వ శతాబ్దంలోకి దూసుకు వెళ్తోందని, ఒకప్పుడు అధికారం పాశ్చాత్య దేశాల చేతుల్లోనే ఉండేదని, ప్రస్తుతం తూర్పు దేశాల ఆధిపత్యం, పార్టిసిపేషన్ పెరిగిందని చెప్పారు. తూర్పు దేశాలు వేగవంతమైన అభివృద్ధిని అందిపుచ్చుకున్నాయని తెలిపారు. గ్లోబల్ డవలప్‌మెంట్‌లో తూర్పు దేశాలు ఏవిధంగా అడ్వాన్స్ అవుతున్నాయో, ఇండియాలోనూ తూర్పు రాష్ట్రాల శకం నడుస్తోందని అన్నారు. బీహార్‌లో 3.5 కోట్ల మందికి పైగా మహిళలకు బ్యాంకు అకౌంట్లు కల్పించామని, గత 1.5 ఏళ్లలో రాష్ట్రంలోని 24,000కు పైగా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.1000 కోట్లు సాయం అందించామని చెప్పారు. ప్రస్తుతం 20కి పైగా లక్‌పతి దీదీలు బిహార్‌లో ఉన్నారని అన్నారు. రాబోయే రోజుల్లా పశ్చిమ భారతదేశంలో మోతిహారి పేరు మారుమోగుతుందని, గురుగ్రామ్ తరహాలోనే గయలోనూ అవకాశాల కల్పన జరుగుతుందని, పుణె తరహాలో పాట్నాలోనూ పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ప్రధాని చెప్పారు. సూరత్ లాగానే సంథాల్ పరగణ కూడా అభివృద్ధి జరుగుతుం దన్నారు.

# గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో...

## గ్రీన్ హైడ్రోజన్‌కు పెరిగిన ప్రాధాన్యం
## ఉత్పత్తి...స్టోరేజీ వంటి అంశాలపై పరిశోధనలు
## గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సూచనలు

అమరావతి,జూలై18: గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరిగిందని, విద్యుత్ తయారీ సంస్థలు ఈ విషయంపై పరిశోధనలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఏపీ ఇలాంటి పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలని చంద్రబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ హైడ్రోజన్ కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది.. 500 గిగావాట్ల హరిత విద్యుత్ తయారీ చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యంగా నిర్దేశిరచుకున్నారు.. నీతి అయోగ్ కూడా దీనిపై దృష్టి సారించింది.. ఎనర్జీ తయారీకి ఖర్చును ఎలా తగ్గించాలి అని ఆలోచిస్తున్నాం అని అన్నారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు- చేసిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో సీఎం పాల్గొని ఎనర్జీ కంపెనీల ఎండీ, సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మీ ఆలోచనలు వినడానికి, ఆవిష్కరణలు తెలుసుకోవడానికే ఇక్కడకు వచ్చాను. విద్యుత్ సంస్కరణలు మొదట ప్రారంభించింది నేనే. సంస్కరణలు అమలు చేసిన కారణంగా అప్పట్లో అధికారం కోల్పోయాం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజీపై దృష్టి సారించాలి. ఏపీ ఇలాంటి పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలని అభిలషించారు. విద్యుత్ సంస్కరణలు దేశంలో తొలిసారి ప్రారంభించింది నేనే.. సంస్కరణలు అమలు చేసిన కారణంగా నేను అప్పట్లో అధికారం కోల్పోయాను.. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజీపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. రెండు రోజులు పాటు మీరు ఇక్కడ ఉంటారు.. మన ప్రధాని కూడా 500 గిగావాట్



తో డౌన్ స్ట్రీమ్ ఇండస్ట్రీగ్రా గ్రీన్ ఎనర్జీపై కృషి చేస్తున్నారు.. ఏపీ హైడ్రోజన్ వ్యాలీగా మారాలని నిర్ణయించాం.. దానికి అవసరం అయినా టెక్నాలజీ మీరు తీసుకురావాలని సూచించారు. మీ అందరికి బెస్ట్ ప్లేస్ ఏపీలో ఉ ంది.. కాబట్టి మీరు అందరు ముందుకు రావాలని చంద్రబాబు కోరారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరిగిందని, విద్యుత్ తయారీ సంస్థలు దీనిపై పరిశోధనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్ కూడా పాల్గొన్నారు.

# సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టేలా చట్టాల్లో మార్పులు: రఘురామకృష్ణంరాజు

అమరావతి, జులై 18: సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టే అంశాలపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పిటిషన్ కమిటీ ఈరోజు (శుక్రవారం) సమావేశమైంది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లను అరికట్టేందుకు పటిష్టమైన చట్టాలు అవసరమన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని మరింత పదును పెట్టేలా మార్పులు, చేర్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ చట్టానికి సవరణలు చేస్తూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేలా కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చట్ట సవరణ తెచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టగలిగితే బాధితుల డబ్బును ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అడ్డుకోవచ్చన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధితులు మోసపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌లు తయారు చేసేవారిపై.. వాటిని ప్రమోట్ చేసే వారిపైనా కేసులు తప్పవని హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌ను అరికట్టేందుకు ఐటీ నాలెడ్జ్ ఉన్న పోలీసు యంత్రాంగం అవసరమన్నారు. బాధితులు 1930కి వెంటనే ఫిర్యాదు చేయాలని చెప్పారు.

# టిడిపి ఎంపిలతో చంద్రబాబు సమీక్ష

## పార్లమెంట్‌లో సమావేశాలపై దిశానిర్దేశం




అమరావతి,జులై 18: రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పార్లమెంటులో పోరాటం చేయాలని, అలాగే రాష్ట్రప్రయోజనాలకు సంబంధించి ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాని ఎంపిలకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశర చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. 9 ప్రధాన అంశాలు అజెండాగా పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. వివిధ కేంద్ర పథకాల ద్వారా రుణాల మంజూరులో జాప్యం, మహిళా ప్రజా ప్రతినిధులపై సోషల్ మీడియాలో వైకాపా అసభ్య ప్రచారం వంటి అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడుతూ.. కూటమి పాలనలో అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులు తెచ్చుకున్నామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై ప్రస్తావించబోతున్నాం. ఎమర్జెన్సీ పాలనకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దానిపై చర్చిస్తాం. క్వాంటం వ్యాలీపై చర్చిస్తాం. భారత్ గౌరవ్ రైళ్లు, ఏరోస్పేస్ పాలసీపై పార్లమెంట్‌లో చర్చిస్తాం. పెండింగ్ ప్రాజెక్టుల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని కోరతామని అన్నారు.

# అధికారికంగా గుడ్‌బై.. ఇండియా కూటమికి ఆప్ షాక్



న్యూఢిల్లీ: ఇండియా కూటమికి ఆమ్ ఆద్మీ పార్టీ షాక్ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల వరకూ తమ కూటమి పరిమితమని స్పష్టం చేసింది. ఆప్ పార్లమెంటు సభ్యుడు సంజయ్ సింగ్ బుధవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఇండియా కూటమి కింద 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కలిసి పనిచేశాయని, అయితే ఆ తర్వాత జరిగిన హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు సోలోగానే ఎన్నికల్లోకి దిగాయని చెప్పారు.'మేము చాలా స్పష్టంగా మా వైఖరి చెప్పాం. లోక్‌సభ ఎన్నికలకే ఇండియా కూటమి పొత్తులు పరిమితం. పార్లమెంటుకు సంబంధించి ప్రభుత్వం తప్పుడు విధానాలను మేము ఎప్పుడూ ఎండగడుతూనే ఉన్నాం. బీహార్, యూపీ, పూర్వాంచల్‌లో ఇళ్లు, దుకాణాలను బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. ప్రస్తుతం మేము ఇదే అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తనున్నాం' అని సంజయ్ సింగ్ చెప్పారు.

# స్థానిక సంస్థల నిధులు వారికే.. ప్రభుత్వం వాడుకోదు: మంత్రి ఆనం

నెల్లూరు, జులై 18: కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు త్వరలో వస్తున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం పంపనున్నట్లు మంత్రి వెల్లడించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక సంస్థల నిధులను వాటికే కేటాయిస్తామని.. గత ప్రభుత్వం లాగా ఆ నిధులను కూటమి ప్రభుత్వం వాడుకోదని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు తమ ప్రాంతాలు అభివృద్ధి చేసుకునేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. గతంలో సచివాలయాలు ప్రారంభించి పూర్తి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు.



కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఇంటింటికీ వెళ్లి అధికారులు పంపిణీ చేశారని.. వాలెంటరీ వ్యవస్థ లేకుండానే అమలు చేశారని చెప్పుకొచ్చారు. జలజీవన్ మిషన్ కింద రూ.28వేల కోట్లు కేంద్రం ఇస్తామంటే, కనీసం రూ.2వేల కోట్లు కూడా గత ప్రభుత్వం వినియోగించుకోలేదని విమర్శించారు. తల్లికి వందనం కింద నిధులను తల్లి అకౌంట్‌లో జమ చేశామని చెప్పుకొచ్చారు. మంత్రి లోకేష్ చిత్తశుద్ధిగా పథకం అమలు చేసిన తీరును అందరూ అభినందిస్తూ జెడ్పీ మీటింగ్‌లో తీర్మానం చేశామన్నారు. నాడు-నేడులో భాగంగా జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాలల భవనాలను పూర్తి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# జగన్‌పై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు

విశాఖపట్నం, జులై 18: తమిళనాడులో పార్టీలు రాజకీయంగా విభేదించినా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తాయని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఇక్కడ మాత్రం స్వార్థ పూరిత ప్రతిపక్షనీ ఉండటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, పోలవరం, నీటిపారుదల ప్రాజెక్టుల అంశంలో తప్పిదాలపై ప్రజల దృష్టి మరల్చడానికి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. అబద్ధాలే పునాదిగా చేసుకొని పబ్బం గడుపుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. కేవలం రాజకీయలబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసినా.. గత జగన్ సర్కారు ప్రాజెక్ట్ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. జగన్.. ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు.. అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి.. ఆ ప్రయోజనాలు రైతన్నలు పొందేలా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. వైఎస్ జగన్ బాధ్యత గల రాజకీయ నాయకుడిగా పనిచేయాలని ఆయన హితవు పలికారు. రఫ్ఫా.. రఫ్ఫా నరికేస్తానీ.. పొడి చేస్తాం అంటున్నారు.. పోలీసులు సక్రమంగా పనిచేయకూడదని,




విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నారు, పోలీసులుపై కించపరిచేలా మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. జగన్.. మీడియాను టిష్యూ పేపర్తో పోల్చారంటే.. మీడియాపై ఆయనకి ఎలాంటి గౌరవం ఉందో చూడండని మంత్రి అన్నారు. జగన్ కి ఏ వ్యవస్థ మీద గౌరవం లేదు.. ఈ రాష్ట్రానికి నిధులు, పెట్టుబడుదారులు ఎవరూ రాకూడదని ఇలా చేస్తున్నారని మంత్రి చెప్పారు.

ఈ విద్వేషాల్ని ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

శనివారం 19-07-2025

## గల్ఫ్ దేశాలలో ఘోష

పుట్టిన ఊరుతో మట్టి సంబంధం ఉంటుంది. పెరిగిన వాతావరణంలో అన్యోన్యత ఉంటుంది.. చుట్టుపక్కల వారితో అనుబంధం ఉంటుంది. ఇవన్నీ తెంచుకోవడం అంటే ఊపిరిని వదిలినట్టే.. మనదేశమే కాదు.. ఏ దేశాల్లో ఉన్న వారైనా సరే అంత సులువుగా ఈ బంధాలను వదులుకోలేరు.. అది అంత సులభం కూడా కాదు..ఉన్నత చదువులు చదివినప్పటికీ.. సరైన ఉద్యోగాలు రాక.. ఉద్యోగాల వల్ల వచ్చే వేతనాలు సరిపోక.. కుటుంబ అవసరాలు పెరిగిపోయి.. ఖర్చులు విపరీతం కావడంతో మనదేశంలో కేరళ రాష్ట్రానికి చెందిన కొందరు ఉద్యోగం కోసం.. మెరుగైన జీవితం కోసం.. సామాజికంగా హోదా కోసం.. గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. కొందరైతే ఆఫ్రికా వంటి ఖండాలకు కూడా వెళ్తున్నారు.. మనదేశంలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేకంగా ఒక కేంద్రం ఉందంటే అది కేరళ రాష్ట్రంలో మాత్రమే..కేరళ రాష్ట్రానికి చెందిన సినిమాలు మన దేశంతో సమాంతరంగా గల్ఫ్ దేశాలలో విడుదలవుతాయి.. మోహన్ లాల్, మమ్ముట్టి వంటి మలయాళ అగ్ర కథానాయకులు నుంచి మొదలు పెడితే చిన్న స్థాయి నటుల వరకు తమ సినిమాల ప్రమోషన్ల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం పరిపాటి. పైగా గల్ఫ్ దేశాలలో మలయాళీలు ఏకంగా సంఘాలు కూడా కొనసాగిస్తున్నారు. అక్కడ ఆలయాలు కూడా నిర్మిస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక కోణం మాత్రమే. మరో కోణంలో నిమిష లాంటి ఘటనలు కనిపిస్తూనే ఉంటాయి. అరదుగా మాత్రమే ఇటువంటి దారుణాలలో చిక్కుకున్నవారు బయటపడతారు. మిగతా మంది అక్కడ చట్టాలకు బలవుతుంటారు..కేరళ నుంచి ఎక్కువగా నర్సింగ్, నిర్మాణరంగం లో పనిచేయడానికి వెళుతుంటారు.. గల్ఫ్ దేశాలలో చట్టాలు చాలా విచిత్రంగా ఉంటాయి. అదే సమయంలో కఠినంగా కూడా ఉంటాయి. మన ప్రమేయం లేకపోయినప్పటికీ ఏదైనా జరిగితే దోషులుగా చిత్రీకరిస్తారు. పైగా అక్కడ మనకంటూ ఎవరూ ఉండకపోవడం వల్ల బాధను వినేవాడు ఉండడు.. అక్కడ న్యాయస్థానాలు కూడా పోలీసులు చెప్పింది గుడ్డిగా వింటాయి. మరో మాటకు తావు లేకుండా మరణశిక్షనే విధిస్తుంటాయి. ఇండియన్స్ అంటే అక్కడివారికి ఉండే చులకన భావం కూడా ఒక కారణం. అందువల్లే గల్ఫ్ దేశాలలో మనవాళ్లు చాలా ఇబ్బందికరమైన జీవితాన్ని గడుపుతుంటారు.అంత ఇబ్బందులు పడుకుంటూ అక్కడ ఉండడానికి ప్రధాన కారణం.. మన వాళ్ళ ఆర్థిక పరిస్థితులు స్వదేశంలో బాగో లేకపోవడమే.. పైగా అక్కడి కరెన్సీ కి విలువ ఎక్కువగా ఉంటుంది. స్వదేశంలో ఆర్థిక కష్టాలు.. కుటుంబ నిర్వహణ.. సామాజిక హోదా.. ఆర్థిక స్థిరత్వాన్ని సంపాదించడం.. ఇలాంటి అనేక కారణాలతో చాలామంది గల్ఫ్ దేశాలకు వెళుతుంటారు.. అక్కడ కరెన్సీకి విలువ అధికంగా ఉండడం.. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడం వల్ల కేరళ వాసులు గల్ఫ్ దేశాలకు ప్రయాణం సాగిస్తుంటారు.గల్ఫ్ దేశాలలో చెప్పుకున్నంత స్థాయిలో అవకాశాలు ఉండవు. అక్కడ నిబంధనలు, చట్టాలు అత్యంత దారుణంగా ఉంటాయి. అక్కడ ప్రభుత్వాలు వేసే శిక్షలు కూడా అదే స్థాయిలో ఉంటాయి.. మన ప్రమేయం లేకుండా జరిగిన ప్రమాదాలైనప్పటికీ దోషులుగానే చిత్రీకరిస్తారు. భారత దౌత్య విభాగం రంగ ప్రవేశం చేసేదాకా బయట ప్రపంచానికి ఈ విషయాలను చెప్పరు. పైగా జైళ్లల్లో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంటారు.. ఇవన్నీ కూడా సగటు భారతీయులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంటాయి.. అన్ని ఇబ్బందులు పడుతూ కూడా మన వాళ్లు అక్కడ ఉండడానికి ప్రధాన కారణం సమస్యలే.ఇండియాలో అంతగా అవకాశాలు లేకపోవడం.. ఉన్న అవకాశాలలో వేతనాలు తక్కువగా ఉండడం.. కుటుంబ అవసరాలు విపరీతంగా ఉండడం.. ఇవన్నీ కూడా భారతీయులను గల్ఫ్ దేశాల నుంచి తిరిగి రానివ్వకుండా చేస్తున్నాయి.. నిమిష ప్రియ లాంటి ఉదంతాలు వెలుగులోకి వచ్చినప్పటికీ అరదుగా మాత్రమే ఉన్నత స్థాయిలో స్పందనలు ఉంటున్నాయి. అది కూడా అంతగా పరిష్కార మార్గాన్ని చూపడం లేదు.నిమిష ప్రియ ఉదంతాన్నే పరిశీలనకు తీసుకుంటే.. క్షమా ధనాన్ని ఇస్తామని చెప్పినప్పటికీ బాధిత కుటుంబ సభ్యులు ఒప్పుకోవడం లేదు. మరణ శిక్షణ విధించాలని పట్టుబడుతున్నారు. వాస్తవానికి నిమిష ప్రియ తాను వెళ్లిన దేశంలో క్లినిక్ ఏర్పాటు చేసింది. దాని భాగస్వామ్య వ్యవహరించిన యెమెన్ దేశపు వ్యక్తి ఆమెను ఇబ్బంది పెట్టసాగాడు. గత్యంతరం లేక ఆమె మత్తు ఇంజక్షన్ వేసి అతడి నుంచి తప్పించుకుంది. ఒకవేళ ఆమె గనుక ఆ చర్యకు పాల్పడకపోతే ఏమి ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఆమె తన స్వీయ రక్షణా ర్థం చేసిన పనిని అక్కడి ప్రభుత్వం తప్పుగా భావిస్తోంది. పోలీసులు కూడా ఆమెను నిర్బంధంలోకి తీసుకొని దోషిగా చిత్రీకరించారు.. అక్కడి కోర్టు కూడా ఆమెకు మరణ దండన విధించింది.వాస్తవానికి గల్ఫ్ దేశాలలో చట్టాలు అక్కడి ప్రజలకు అనుకూలంగా ఉంటాయి. అక్కడ వారు తప్పు చేసినప్పటికీ రక్షించడానికి అనేక వ్యవస్థలు అండగా ఉంటాయి.యెమెన్‌లో భారతీయ నర్సు నిమిష ప్రియ మరణ శిక్ష వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన తర్వాత.. 94 ఏళ్ల మతగురువు, గ్రాండ్ ముఫ్తీ ఏ.పీ అబూబకర్ ముస్లియార్ గురించి మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.యెమెన్‌కు చెందిన తలాల్ అబ్దో మహదీ హత్య కేసులో నిమిష ప్రియకు మరణ శిక్ష పడింది. కుటుంబం ఇచ్చే క్షమాభిక్షే అత్యంత కీలకం.కేరళలో అత్యంత గౌరవప్రదమైన, పలుకుబడి ఉన్న ముస్లిం మతనాయకుడు అబూబకర్ ముస్లియార్ నిమిష ప్రియ కేసు గురించి జులై 14న యెమెన్‌లోని కొందరు షేక్‌లతో మాట్లాడినట్లు నిమిష ప్రియను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న సేవ్ నిమిష ప్రియ ఇంటర్ యాక్షన్ కౌన్సిల్ క్యాంపెయిన్ తెలిపింది.” సేవ్ నిమిష ప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్ సభ్యులు గ్రాండ్ ముఫ్తీని కలిసి మాట్లాడారు.

# తెరపైకి కచ్చా తీవు...


చెన్నై, జూలై 18, కచ్చతీవు ద్వీపం.. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో.. ఇది చర్చనీయాంశమైంది. దీనిపై రాజకీయ రగడ జరిగింది. ఈ చిన్న ద్వీపం.. భారత్?శ్రీలంక మధ్య పాక్ జలసంధిలో ఉంది, తమిళనాడు జాలర్లకు జీవనాధారంగా ఉండడమే కాక, దశాబ్దాలుగా రాజకీయ వివాదంగా కొనసాగుతోంది. 1974లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించడం తమిళనాడులో అసంతృప్తిని రేకెత్తించింది. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ ఈ అంశాన్ని మళ్లీ లేవనెత్తడం, కేంద్రం దీనిని రాజకీయం చేస్తోందని ఆరోపించడం ఈ సమస్య యొక్క సంక్లిష్టతను తెలియజేస్తుంది.కచ్చతీవు ద్వీపం తమిళనాడులోని రామేశ్వరం నుంచి 10 నాటికల్ మైళ్లు, శ్రీలంకలోని జాఫ్నా నుంచి 10.5 నాటికల్ మైళ్ల దూరంలో పాక్ జలసంధిలో ఉంది. 1.7 కిలోమీటర్ల పొడవు, 300 మీటర్ల వెడల్పు కలిగిన ఈ ద్వీపంలో శాశ్వత నివాసితులు లేరు, కానీ సెయింట్ ఆంథోనీ చర్చి ఉంది, ఇక్కడ జరిగే వార్షిక ఉత్సవాలలో తమిళనాడు జాలర్లు పాల్గొంటారు. ఈ ద్వీపం చుట్టూ ఉన్న సముద్రంలో మత్స్య సంపద సమృద్ధిగా ఉండటంతో తమిళ జాలర్లకు ఇది ఆర్థికంగా కీలకమైన ప్రాంతం.1974లో భారత ప్రధాని ఇందిరా గాంధీ, శ్రీలంక అధ్యక్షురాలు సిరిమావో బండారనాయకే మధ్య జరిగిన ఒప్పందం ద్వారా కచ్చతీవు ద్వీపం శ్రీలంకకు అప్పగించబడింది. ఈ ఒప్పందం ప్రకారం, తమిళనాడు జాలర్లు ఈ ద్వీపంలో చేపలు పట్టడం, చర్చి ఉత్సవాలలో పాల్గొనడం కొనసాగించవచ్చని నిర్ధారించబడింది. అయితే, 1976లో శ్రీలంక మరో ఒప్పందం ద్వారా సముద్ర సరిహద్దులను విభజించి, తమ ప్రాంతంలో భారత జాలర్ల చేపల వేటను నిషేధించడం సమస్యలకు దారితీసింది. 1976 ఒప్పందం తర్వాత, శ్రీలంక నౌకాదళం తమిళ జాలర్లపై దాడులు, అరెస్టులు, వారి బోట్లను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతోంది. ఈ దాడుల వల్ల తమిళ జాలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారు, రూ. లక్షల విలువైన పడవలు నాశనమవుతున్నాయి. ఈ పరిస్థితి తమిళనాడు జాలర్లలో అసంతృప్తిని పెంచింది, ఇది రాజకీయంగా సున్నితమైన అంశంగా మారింది. కచ్చతీవు ద్వీపం తమిళ జాలర్లకు కేవలం ఆర్థిక వనరు మాత్రమే కాదు, సాంస్కృతిక మరియు భావోద్వేగ సంబంధం కూడా కలిగి ఉంది.ప్రధాని నరేంద్ర మోదీ 1974లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కచ్చతీవును శ్రీలంకకు అప్పగించిందని ఆరోపించారు. ఈ నిర్ణయం భారత జాలర్ల హక్కులను కాపాడలేకపోయిందని, దీని వల్ల తమిళనాడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కచ్చతీవును తిరిగి స్వాధీనం చేసుకోవాలని కేంద్రాన్ని కోరారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి ఏమీ చేయలేదని, దీనిని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తోందని ఆరోపించారు.న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, భారత భూభాగాన్ని పార్లమెంటు ఆమోదం లేకుండా అప్పగించడం చట్టవిరుద్ధం. ఈ వాదన కచ్చతీవు ఒప్పందం యొక్క చెల్లుబాటుపై ప్రశ్నలను లేవనెత్తుతుంది. కచ్చతీవును తిరిగి స్వాధీనం చేసుకోవడం భారత్?శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలను ఒత్తిడికి గురిచేయవచ్చు. శ్రీలంక ఈ ద్వీపాన్ని తమ భూభాగంగా పరిగణిస్తోంది, దీనిపై చర్చలు సంక్లిష్టంగా ఉంటాయి. తమిళ జాలర్లపై శ్రీలంక నౌకాదళ దాడులను నివారించడానికి ఉభయ దేశాల మధ్య సమన్వయం అవసరం. జాలర్ల ఆర్థిక నష్టాలను తగ్గించడానికి తక్షణ చర్యలు అవసరం. అయితే తమిళనాడులో ఈ అంశం ప్రతి ఎన్నికల్లో కీలకంగా మారుతోంది

# ప్రైవేటు హాస్టల్స్ పై ఫోకస్..

### ప్రభుత్వం హాస్టల్స్ సంగతేంటీ

హైదరాబాద్, జూలై 18, ప్రైవేట్ హాస్టళ్లలో పరిస్థితి, వాటిలో విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో ఎప్పటి నుంచో చర్చ నడుస్తోంది. అయితే కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన హాస్టళ్లలో విద్యార్థులు అత్యంత దయనీయమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు ప్రత్యక్షంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ వుమన్ అండ్ చైల్డ్ కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద తనిఖీలు చేయడం వల్ల బట్టబయలయ్యాయి.తమ పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే తపనతో లక్షల రుపాయాలు వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు చెందిన వారు సైతం కార్పొరేట్ విద్యా సంస్థలలో చేర్పిస్తున్నారు. కాని అందుకు తగిన విధంగా విద్యార్థులకు వసతులు కల్పించే విషయంలో యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు కళ్లారా చూస్తే తప్ప తెలియదు. ప్రధానంగా ఈ విద్యా సంస్థల వైపు అధికారులు కన్నెత్తి చూడరు. లోపల ఏం జరుగుతుందో బయటికి తెలియకుండా జాగ్రత్త పడతారు. అవసరమైతే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో వెనుకాడరనే విమర్శలున్నాయి. కనీసం తల్లిదండ్రులను కూడా లోపలికి అనుమతించకపోవడం. వారు ఏ పరిస్థితులో హాస్టళ్లో ఉంటున్నారు. ఎలా, ఏం తింటున్నారు.. అనే విషయాలపై బయటికి ఎవరు చెప్పినా, వారిని మానసిక వేధించడం, పనిష్మెంట్ కింద సస్పెండ్ చేయడం లాంటి దుర్మార్గపు పోకడలను అనుసరిసరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ పరిశీలనలో బయటపడ్డాయి. కాని వారిపై చర్యలు తీసుకునే ధైర్యం గత ప్రభుత్వాలు చేయలేదు. ఈ ప్రభుత్వమైనా ఆ దిశలో అడుగులు వేయాలని కోరుకుంటున్నారు.అయితే ప్రైవేట్ హాస్టళ్లలో మాత్రమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ హాస్టళ్లను తనిఖీ చేయడం లేదని, అక్కడి పరిస్థితి, అక్కడ ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలనే ప్రశ్న ఉదయించడం సర్వసాధారణమే. కాని అందుకు ఆమె ధీటైన సమాధానం చెప్పారు. కేవలం ప్రైవేట్ సంస్థలు కాకుండా ప్రభుత్వ హాస్టళ్లు విజిట్ చేసిన సందర్భాలను గుర్తు చేస్తూ ఒక ఇంటర్వ్యూలో యాంకర్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు. అయితే వాటి పరిస్థితి లక్షలు పెట్టి చదివిస్తున్న హాస్టళ్లతో పోల్చడం సమంజసం కాదు. ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితి అనుకున్న స్థాయిలో మెరుగ్గా లేకపోయినా, ప్రైవేట్ హాస్టళ్లలలో పరిస్థితి మరీ దయనీయంగా కనిపిస్తోంది.కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద విషయానికి వస్తే, ఒక ఉన్నతాశయంతో జెడ్పీటీసీగా ఎన్నికై రాజకీయాల్లోకి వచ్చిన ఆమె కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా సేవలందిస్తు వస్తున్నారు. రాజకీయ ఉద్దండులు మాజీ మంత్రి ఎమ్మెస్సార్ శిష్యురాలిగా, దివంగత రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో మాట తప్పని, మడమ తిప్పని సిద్దాంతాన్ని పునికిపుచ్చుకున్ననేరెళ్ల శారద వేసే ప్రతి అడుగుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఆమె ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ముక్కుసూటిగా మాట్లాడే తత్వం, అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించడంతో పాటు సమస్యలను ఆకలింపు చేసుకొని వాటి పరిష్కారానికి ఎంతదూరమైన వెళ్లేందుకు వెనుకాడని మనస్తత్వం వుమన్ కమిషన్ చైర్ పర్సన్ పదవిలో రాణించేందుకు దోహదపడింది.ఏ సమస్యనైనా చెప్పుకోలేక, లోలోపల కుమిలిపోతూ బాధ అనుభవిస్తున్న విద్యార్థినుల సమస్యలను పట్టించుకోవడం, తామున్నామన్న భరోసా కల్పించే విషయంలో ఒక బలమైన అడుగు పడిందని భావించవచ్చు. అయితే ఒకేసారి పూర్తిగా ప్రక్షాళన సాధ్యం కాకున్నా, అంచెలంచెలుగా మార్పుకు ఈ అడుగు శ్రీకారం కావాలని, ఇలాంటి ప్రయత్నానికి అందరి మద్దతు ఉంటేనే పరిస్థితులు మారుతాయని పరిశీలకులు విశ్వసిస్తున్నారు.

# కేటీఆర్, లోకేష్ డిన్నర్ మీటింగ్ .



హైదరాబాద్, జూలై 18, తెలంగాణ రాజకీయాల్లో సంచలనం జరగబోతుందా? ఉప్పు, నిప్పులు కలవడానికి కారణాలేంటి? ఇదే ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. బీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీ రెండూ ఒకరంటే ఒకరికి పడవు. అది జగమెరిగిన సత్యం. కేసీఆర్, జగన్ కు, చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు మధ్య ఉన్న కెమెస్ట్రీ అందరికీ తెలుసు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన కేసీఆర్ వేరే పార్టీ పెట్టుకుని ముఖ్యమంత్రి అయినప్పటికీ చంద్రబాబును తొలి నుంచి వ్యతిరేకించడంలో ముందుంటారు. అందుకే జగన్ కు దగ్గరయ్యారు. జగన్, కేసీఆర్ లు రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య అనేక సార్లు చర్చలు జరిగాయి. ఒకరి వద్దకు మరొకరు వెళ్లి కలుసుకుని కష్టసుఖాలను మాట్లాడుకున్నారు. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు జాతీయ స్థాయిలో పడకపోయినా, వీరిద్దరి మధ్య సత్సంబంధాలున్నాయన్నది వాస్తవం. అందుకే ఇప్పటికే ఒకసారి హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో సమావేశమై ఇరు రాష్ట్రాల మధ్య విభజన సందర్భంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకునే దిశగా చర్చలు జరిగాయి. తాజాగా ఢిల్లీలో గోదావరి, కృష్ణా నదీ జలాల వాటాపై కూడా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఎవరు అధికారంలో ఉన్నా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్య కలిగి ఉండటం అందరూ హర్షించదగ్గ విషయమే. కానీ ఇక్కడ అర్థం కాని విషయమేంటంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమావేశం అవ్వడంపైనే చర్చ జరుగుతుంది. ఇది అఫిషియల్ మీటింగ్ కాదు. డిన్నర్ మీటింగ్ అని సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరువురు నేతలు యువ నేతలు కలవడంతో ఖచ్చితంగా తాజా రాజకీయాలపై చర్చ జరిగి ఉంటుందన్న అంచనాలు మాత్రం వినపడుతున్నాయి. అయితే ఏ అంశంపై చర్చించడానికి కేటీఆర్, లోకేశ్ కలిశారన్నది తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలపై వీళ్లిద్దరూ మాట్లాడుకున్నారా? అంటే రెండు పార్టీలు కలసి పోటీ చేసే అవకాశం లేదు కాబట్టి ఆ విషయం మాత్రం కాదని అందరికీ తెలుసు. కాకుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనే కేటీఆర్, లోకేశ్ చర్చించి ఉంటారని అంటున్నారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందినప్పుడు కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చారు. మాగంటి గోపీనాథ్ 2014లో టీడీపీ గుర్తుపై గెలిచి తర్వాత బీఆర్ఎస్ లోకి మారారు. త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాట్లాడుకునేందుకు మాత్రమే ఈ ఇద్దరు నేతలు కలిసినట్లు ప్రచారం జరుగుతుంది. మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచి ఎవరినైనా పోటీకి దింపాలా? మరెవరైనా అభ్యర్థిని బరిలోకి దింపితే ఎలా ఉంటుందన్న దానిపై ఇద్దరి మధ్య చర్చ జరుగినట్లు తెలిసింది. కేటీఆర్, లోకేశ్ భేటీలో కేవలం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మీద మాత్రమే చర్చ జరిగి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

## కిరిటీ డ్యాన్స్ కు మంచి మార్కులు

హైదరాబాద్, జూలై 18,ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డి కథానాయకుడిగా పరిచయమైన సినిమా ‘జూనియర్’. శ్రీ లీల హీరోయిన్. జెనీలియా కీలక పాత్ర చేశారు. కన్నడ స్టార్ రవిచంద్రన్, రావు రమేష్ తదితరులు నటించిన ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ అయింది’జూనియర్’ ప్రీమియర్ షోస్ చూసిన జనాలు అందరూ చెప్పే మాటలో కామన్ పాయింట్ ఒక్కటే... కిరీటి డ్యాన్సులు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ అంటే తనకు ఇష్టమని సినిమా విడుదలకు ముందు కిరీటి చెప్పారు. డ్యాన్సుల్లో తన ఫేవరెట్ హీరో స్టైల్ ఫాలో అయ్యారు కిరీటి. యాక్షన్ సీక్వెన్సులు కూడా బాగా చేశారని పేరు వచ్చింది.

నటుడిగా, హీరోగా ఆయనకు మంచి డెబ్యూ అని టాక్ వచ్చిందికిరీటి రెడ్డి డ్యాన్సులకు మంచి మార్కులు పడ్డాయి కానీ సినిమాకు మాత్రం సూపర్ హిట్, యునానిమస్ పాజిటివ్ టాక్ రాలేదు. కమర్షియల్ టెంప్లేట్, రొటీన్ ఫార్ములా కథతో సాగే సినిమా అని ప్రీమియర్స్ చూసిన ఆడియన్స్ చెబుతున్నారు. ‘జూనియర్’ ఫస్టాఫ్ కమర్షియల్ అయితే సెకండాఫ్ అంతా ఎమోషనల్‌గా సాగిందట. ఎన్నో సినిమాల్లో చూసిన సన్నివేశాలు మళ్ళీ మళ్ళీ తెరపై వచ్చినట్టు ఉన్నాయని కొందరు విమర్శలు చేస్తున్నారు. విలన్ క్యారెక్టర్ వీక్ అని కూడా టాక్ వచ్చింది.రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పాటల్లో ‘వైరల్ వయ్యారి’ కొన్నాళ్లు వినిపించడం గ్యారెంటీ. ఆల్రెడీ విడుదలైన లిరికల్ వీడియోలో స్టెప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కిరీటి, శ్రీ లీల పెయిర్ డ్యాన్స్ బాగా చేయడం కూడా కలిసి వచ్చింది. సినిమా చూసిన జనాలు కిరీటి గురించి మాట్లాడుతున్నారు తప్ప హిట్ అని మాత్రం అనడం లేదు. సోషల్ మీడియాలో టాక్ ఎలా ఉంది? ట్విట్టర్‌లో ఎవరెవరు ఎలా వేశారు? అనేది ఒక్కసారి చూడండి.

## వెలవెలబోతున్న సోషల్ మీడియా
## పాఫం...రేవంత్

హైదరాబాద్, జూలై 18, మీ కష్టం పగోడికి కూడా రావద్దు సీఎం సార్.. ఎంత పాపం ఇదీ.. మరీ ఇంత ఘోరమా.. దేన్నైతే ఆయుధంగా మలిచి బీఆర్ఎస్ ను గద్దెదించాడో అదే ఆయుధంతో ఇప్పుడు బీఆర్ఎస్ కొడుతుంటే పాపం రేవంత్ రెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు.. తట్టుకోలేకపోతున్నాడు. వేదికలపై ఇదే చెప్పుకొని బాధపడుతున్నాడు.సాధారణంగా అధికారంలో ఉంటే కొండంత బలం ఉంటుంది. ఆ బలంతో ఏమైనా చేయవచ్చు. ఈ కారు రేసింగ్ లో కేటీఆర్ ను జైలుకు పంపే సదావకాశం వచ్చినా రేవంత్ ఆ ధైర్యం చేయలేదు. ఎందుకంటే దాని వల్ల నష్టమే తప్ప లాభం లేదని స్వయంగా జైలుకెళ్లి సీఎం అయిన రేవంత్ కు విషయం బాగా తెలుసు. సానుభూతితో కేటీఆర్ తన ప్రభుత్వానికి ఎసరు పెడుతాడని తెలుసు. అందుకే కేసీఆర్, కేటీఆర్ ల విషయంలో రేవంత్ రెడ్డి ధైర్యంగా ముందడుగు వేయడం లేదు.ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహకర్త ఐడియాలజీతో సోషల్ మీడియా ద్వారా యుద్ధం చేసి గెలిచాడు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ను గద్దెదింపడంలో ఇదే సోషల్ మీడియా కాంగ్రెస్ కు పాశుపతాస్త్రమైంది. ఎంతలా అంటే.. ఇన్ని సంక్షేమ పథకాలు పంచే బదులు ఓ 30 యూట్యూబ్ చానెల్స్ ను, సోషల్ మీడియాలను పెట్టుకుంటే మేం గెలిచే వాల్లం అని స్వయంగా కేటీఆర్ అన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.అందుకే ఓడిపోగానే కేసీఆర్ చేసిన మొదటి పని.. చిన్నా చితక జర్నలిస్టులందరినీ చేరదేరి వారితో సోషల్ మీడియా సైన్యాన్ని తయారు చేసి రేవంత్ రెడ్డి మీదకు వదిలారు. వారు తెలంగాణలో చీమ చిటుక్కుమన్నా.. రేవంత్ కు అంటగట్టి నానా యాగీ చేస్తున్నారు.ఎంత కంట్రోల్ చేద్దామన్నా ఇది రేవంత్ చేయి దాటిపోయింది. అప్పట్లో మహబూబ్ నగర్ లో రైతులపై అఘాయిత్యం కానీ.. హైడ్రా కూల్చివేతలు.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుల్డోజర్ తవ్వకాలు ఇలా మొత్తం రేవంత్ ఇమేజ్ ను జాతీయ స్థాయిలో డ్యామేజ్ చేయించడంలో కేటీఆర్ సక్సెస్ అయ్యారు.ఇప్పుడు ఏకంగా తెలంగాణలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండగానే.. ఆయనకే వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ం-జి అవినీతి పేరిట హోర్డింగులు పెట్టించి కాంగ్రెస్ ప్రభుత్వం పరవు తీస్తున్నారంటే బీఆర్ఎస్ క్యాంపెయిన్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ సోషల్ దెబ్బకు కాంగ్రెస్ విలవిలలాడుతోంది. రేవంత్ రెడ్డికి తలబొప్పి కడుతోంది. ‘ఫాఫం రేవంత్ రెడ్డి’ అని బిత్తిరి సత్తి భాషలో వాపోవడం తప్ప మనం చేసేది ఏమీ లేదు..

## క్రెడిట్ వార్ షురూ

హైదరాబాద్, జూలై 18,తెలంగాణ వాటర్ వార్‌లో నయా ట్రెండ్ షురూ అయింది. ప్రాజెక్టులు, వాటి ఖర్చుల లెక్కలు, అవినీతి ఆరోపణలు, అంకెలు-రంకెలు పక్కకుపోయాయి. ప్రస్తుతం నీటి పారుదల రాజకీయం ప్రవహిస్తోంది. ప్రాజెక్టుల చుట్టూ లేటెస్ట్ పొలిటికల్ రౌండ్ షురూ అయింది. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల విషయంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్?సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రాజెక్టుల నుంచి కాంగ్రెస్ సర్కార్ విడుదల చేస్తున్న ప్రతి నీటిబొట్టు తమ కష్టమే అంటోంది గులాబీ పార్టీ. నీటి విడుదల తమ పుణ్యమే అంటూ క్లెయిమ్ చేసుకుంటోంది బీఆర్ఎస్..లేటెస్టుగా భద్రాద్రి సీతారామ ప్రాజెక్ట్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. అశ్వాపురం మండలం బీ.జీ. కొత్తూరు దగ్గర.. మొదటి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలు ప్రవహించాయి. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కావడంతో.. పంటలు ఎండకుండా గోదావరి జలాలను విడుదల చేసినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఇదంతా తమ కష్టమే అంటోంది బీఆర్ఎస్. గతంలో కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషంగా ఉందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు.

# అమరావతి రోడ్డులో హైటెక్ సిటీ

అమరావతి, జూలై 18,ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కోసం టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ కీలక సిఫార్సులు చేసింది. అమరావతి రింగ్ రోడ్డులో హైటెక్ సిటీ ఏర్పాటు చేయాలని, కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ల వంటి అత్యాధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచించింది. విశాఖ, అనంతపురం, తిరుపతిలో ఐటీ పార్కులు, మెడిసిటీలను అభివృద్ధి చేయాలని పేర్కొంది. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, టూరిజం రంగాలపై దృష్టి సారించాలని తెలిపింది. పెట్టుబడులకు రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని టాస్క్ ఫోర్స్ అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా హైటెక్ సిటీ ఏర్పాటు అంశంపై మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047' లక్ష్యసాధన కోసం దేశంలో అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కోసం ఒక టాస్క్‌ఫోర్స్ కొన్ని సిఫార్సులు చేసింది. అమరావతి రింగ్ రోడ్డులో హైటెక్ సిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. కృత్రిమ మేధ (ఎఐ), సెమీ కండక్టర్ల వంటి అత్యాధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచనలు చేసింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ ఈ నివేదికను రూపొందించగా.. ఢిల్లీలో విడుదల చేశారు. టాస్క్‌ఫోర్స్ 360 పేజీల నివేదికను తయారు చేసింది.ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, డ్రోన్స్ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపింది. తిరుపతి జిల్లాలోని 'శ్రీ సిటీ' తరహాలో ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి చేయాలని సూచించింది. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో ఐటీ పార్కులు ఏర్పాటు చేయాలని పేర్కొంది. పరిశోధన సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని సిఫారసు చేసింది. అమరావతి చుట్టుపక్కల మెడిసిటీని అభివృద్ధి చేయాలని కూడా తెలిపింది. రాష్ట్రంలోని జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి వంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం వంటి రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ అంటే ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలు తయారు చేసే పరిశ్రమలు.. వీటితో పాటు బ్లూ ఎకానమీ, రోబోటిక్స్, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్లు, లాజిస్టిక్స్, ఏఐ వంటి వాటిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుందని సూచనలు చేశారు. థీమ్ ఆధారిత పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం.. నైపుణ్యాభివృద్ధి కూడా అవసరమన్నారు. పరిశ్రమల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలంటున్నారు. చంద్రబాబు ప్రతిపాదించిన పీ4 విధానం రాష్ట్ర అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందని.. ఇలాంటి మంచి ఆలోచనలను రాష్ట్రం వెంటనే తీసుకోవాల్నారు.'ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్ (ఏఎంటీజెడ్) ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలి. లైఫ్‌సైన్సెస్, టెక్నాలజీ రంగాల్లో మంచి అవకాశాలను అందుకోవడానికి ప్రపంచ స్థాయి సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలి. సెమీకండక్టర్లు, ఫ్యాబ్స్, డిస్‌ప్లే యూనిట్‌లు, ఎనర్జీ స్టోరేజ్, సోలార్ సెల్స్ వంటి ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ పరిశ్రమలను నెలకొల్పడంపై శ్రద్ధ పెట్టాలి. అప్పులు అభివృద్ధికి అడ్డు రాకుండా చూసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనేక అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్, జీవశాస్త్ర సాంకేతికత, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, నీలి ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టవచ్చు' అంటున్నారు. మరి ఏపీ ప్రభుత్వం హైటెక్ సిటీ ఏర్పాటు సూచనపై ఎలా స్పందిస్తుందన్నది చూడాలి.

# వేటు పడాల్సిందే

అనంతపురం జూలై 18, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీసుకునే నిర్ణయాలతో పార్టీ సీనియర్లకు కూడా దడ పుట్టించేలా ఉన్నాయి. జగన్ పార్టీకి ఉపయోగపడని నేతలతో పాటు వ్యతిరేకించే నేతలను కూడా వదిలపెట్టబోనని ఇటీవల కాలంలో హెచ్చరికలు జారీ చేస్తుండటంతో పాటు చర్యలు కూడా తీసుకుంటుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా నాలుగేళ్లు ఎన్నికలకు సమయం ఉందని భావించిన అనేక మంది నేతలు తమ వ్యాపారాలను చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. కొందరు నియోజకవర్గాలకు కూడా దూరంగానే ఉంటున్నారు. వారందరికీ ఇప్పుడు జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో పార్టీ సీనియర్ నేతల్లో కూడా భయం మొదలయింది.. టెక్కలి ఇన్ ఛార్జి, వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి జగన్ సస్పెండ్ చేశారు. అయితే దువ్వాడ శ్రీనివాస్ యాక్టివ్ గా రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయన వ్యక్తిగత జీవితంలో తీసుకున్న నిర్ణయంతో ఆయనను పార్టీ నుంచి పక్కకు తప్పించారు. దువ్వాడ శ్రీనివాస్ జగన్ వీర భక్తుడు. జగన్ అంటే ఒకరకంగా ప్రాణం. అందుకే అధికారంలోకి రాగానే దువ్వాడ శ్రీనివాస్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడమే కాకుండా మొన్నటి ఎన్నికల్లో టెక్కలి టిక్కెట్ కూడా ఇచ్చారు. అయితే కూటమి ప్రభంజనంలో ఓటమి పాలయ్యారు. దువ్వాడ శ్రీనివాస్ కుటుంబంలో తలెత్తిన పరిణామాల నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఇక తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీ నుంచి సీనియర్ నేతలను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం కూడా సంచలనంగా మారింది. హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉంది. అక్కడ వైసీపీ నేతలు నవీన్ నిశ్చల్ , వేణుగోపాల్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. హిందూపురం వైసీపీ సీనియర్ నేతలు నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారన్న ఫిర్యాదులపై పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. సీనియర్ నేతల సస్పెన్షన్ జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నిజానికి ఇద్దరినీ పిలిచి జగన్ మాట్లాడవచ్చు. కానీ అలాంటిదేమీ లేకుండానే మాటల్లేవు.. మాట్లాడుకోడాల్లేవ్.. అన్న రీతిలో



సస్పెన్షన్ వేటు వేయడం జిల్లాలోనే కాదు రాష్ట్రంలోని వైసీపీలోనూ హాట్ టాపిక్ గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వైసీపీకి చెందిన ఇద్దరు కీలక నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలక నేతలు నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిని వైసీపీ సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని.. క్రమశిక్షణావళిని ఉల్లంఘించారనే ఆరోపణలు రావటంతో వైసీపీ ఈ నిర్ణయం తీసుకుంది. వైసీపీ క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు వైఎస్ జగన్ నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.అయితే 2029 ఎన్నికల్లో హిందూపురం వైసీపీ అభ్యర్థిగా తనకే టికెట్ వస్తుందని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో నవీన్ నిశ్చల్ బహిరంగ ప్రకటన చేశారు. నవీన్ నిశ్చల్ బహిరంగ ప్రకటనపై వైసీపీలోని మరోవర్గమైన దీపిక వర్గం అసంతృప్తి గురైనట్లు తెలిసింది. దీనిపై ప్రస్తుతం హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇంఛార్జిగా ఉన్న దీపిక ఫిర్యాదుతోనే నవీన్ నిశ్చల్ మీద సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి నందమూరి బాలకృష్ణ, వైసీపీ నుంచి దీపిక పోటీ చేయగా.. బాలయ్య వరుసగా మూడోసారి గెలుపొంది, హ్యాట్రిక్ కొట్టారు. అయితే నవీన్ నిశ్చల్, వేణుగోపాల్ రెడ్డి చాలా ఏళ్లుగా వైసీపీలో కొనసాగుతున్నారు. నవీన్ నిశ్చల్ హిందూపురంలో బలమైన నేతగా గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తిని సస్పెండ్ చేయటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిందిపార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదన్న హెచ్చరికలను జగన్ జారీ చేసినట్లయింది. అనేక జిల్లాల్లో వైసీపీ నేతలు అధికార టీడీపీ, జనసేన నేతల్లో కలిసిపోయి తమ వ్యాపారాలను నిర్వహించుకుంటూ పార్టీ కార్యక్రమాలను పక్కన పెడుతున్నారని తెలిసింది. రాయలసీమలోనే కాకుండా కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సయితం వైసీపీ నేతలు అధికార పార్టీ నేతలతో కలసి పోయి పార్టీ పిలుపు నిచ్చిన కార్యక్రమాలను చేయడం లేదన్న నివేదికలు అందుతుండటంతో ఇక స్పేర్ చేస్తే పార్టీకి ఇబ్బంది కలుగుతుందని భావించిన జగన్ యాక్షన్ కు దిగినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇకపై పార్టీ కోసం పనిచేయని వారిని, పార్టీ లైన్ కు వ్యతిరేకంగా పనిచేసిన వారిని తొలగించాలని జగన్ తీసుకున్న నిర్ణయం సంచలనమే కదా? ఇంకా ఎవరిపై వేటు పడుతుందోనన్న టెన్షన్ వైసీపీ నేతల్లో నెలకొంది

# గ్రీన్ సిగ్నల్ కోసం వెయిటింగ్

విజయవాడ, జూలై 18,తెలుగుదేశం పార్టీ ఫుల్లు ప్యాకప్ అయింది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 175 నియోజకవర్గాల స్థానంలో 225 నియోజకవర్గాలకు చేరుకుంటాయి. అంటే దాదాపు యాభై నియోజకవర్గాలు పెరుగుతాయి. కానీ తెలుగుదేశం పార్టీని చూస్తే హౌస్ ఫుల్ అయింది. సైకిల్ ఎక్కినా ప్రయోజనం లేదు. ఇప్పటికే ఓడిపోయి కొందరు.. టిక్కెట్ రాక మరికొందరు వచ్చే ఎన్నికల్లోనైనా నియోజకవర్గాల సంఖ్య పెరగడంతో తమకు టిక్కెట్ దక్కుతుందేమోనన్న ఆశతో ఉన్నారు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీలో కొత్త తరం వచ్చేస్తుంది. అంతేకాకుండా అనేక సమీకరణాలను తీసుకుని చంద్రబాబు టిక్కెట్ ఇచ్చే వీలుంది. చివర వరకూ టిక్కెట్ దక్కడం కష్టమే.. గత ఎన్నికల్లో సీనియర్ నేతలకు కూడా టిక్కెట్లు దక్కలేదు. దేవినేని ఉమ, జవహర్ లాంటి వాళ్లకే టిక్కెట్లు దక్కలేదు. ఇక్కడ కేవలం విధేయత మాత్రమే కారణం కాదన్నది తెలుగుదేశం పార్టీ నేతలకు అర్థమయింది. అక్కడ చివరి నిమిషంలో ఆర్థికంగా బలమైన వారు, ఎన్ఆర్ఐలు, సామాజికవర్గాల సమీకరణాలతో టిక్కెట్లు సొంతం చేసుకుంటారని గత ఎన్నికల సమయంలోనే స్పష్టమయింది. దీంతో జనసేన అయితే తమకు సేఫ్ ప్లేస్ అని చాలా మంది నమ్ముతున్నారట. ఎక్కువ మంది టీడీపీ, బీజేపీ నేతలు ఇప్పుడు జనసేన వైపు చూస్తున్నారట. వైసీపీ నేతలు ఎలాగూ చూస్తారు. కానీ కూటమి పార్టీలోని మిత్రపక్షాల నేతలే జనసేన వైపు చూస్తున్నారని సమాచారం. జనసేన పార్టీ అయితే రెండు అడ్వాంటేజీలున్నాయి. ఒకటి ఖచ్చితంగా తాము కోరుకున్న చోట టిక్కెట్ దక్కుతుంది. అక్కడ టీడీపీ నుంచి బలమైన నేత ఉన్నప్పటికీ పొత్తులో భాగంగా టిక్కెట్ పొందే వీలుందని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీట్లు దక్కకపోయిన తాము ఈసారి ఆ ఛాన్స్ మిస్ చేయదల్చుకోలేదు. అందుకే ఇప్పటికే కొందరు టీడీపీ నేతలు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు టచ్ లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో టీడీపీ నుంచి వెళ్లి భీమవరం టిక్కెట్ సాధించుకున్న పులపర్తి రామాంజనేయులు ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే అనపర్తి నియోజకవర్గం నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆ నియోజకవర్గం బీజేపీకి కేటాయిచండంతో అందులో చేరి ఎమ్మెల్యే అయిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అవనిగడ్డ నుంచి బుద్ధాప్రసాద్ కూడా చివరి నిమిషంలో టీడీపీ నుంచి జనసేనలో చేరి టిక్కెట్ తెచ్చుకున్నారు. అందుకే ఇప్పటి నుంచే జనసేన పార్టీలో చేరేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నారని తెలిసింది. కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన ఇద్దరు కమ్మ సామాజికవర్గం నేతలతో పాటు రాయలసీమలోని రెడ్డి సామాజికవర్గం నేతలతో పాటు ఉత్తరాంధ్రకు చెందని టీడీపీ సీనియర్ నేతలు ఇద్దరు జనసేనలో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని తెలిసింది. వీరంతా టీడీపీకి సంబందించిన సీనియర్ నేతలే కావడం విశేషం. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దక్కుతుందో లేదో? తెలియక ముందే ఇప్పుడే చేరి ఆ నియోజకవర్గాన్ని ఫిక్స్ చేసుకుంటే మంచిదన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద రానున్న కాలంలో జనసేన పార్టీలోకి నేతల తాకిడి పెరిగే అవకాశముంది. అయితే పవన్ కల్యాణ్ ఏ మేరకు వారి చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారన్నది చూడాల్సి ఉంది.

# మంత్రుల పనితీరుపై అసంతృప్తి...

విజయవాడ, జూలై 18,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల చేసిన హెచ్చరికలు మంత్రులపైన బాగానే పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. మంత్రులు యాక్టివ్ అయ్యారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మంత్రులు యాక్టివ్ గా లేకపోతే కొత్త వారు వస్తారని చేసిన హెచ్చరికలతో అమాత్యులు పరుగులు పెడుతున్నారు. మొన్నటి వరకూ అనావృష్టి ఇప్పుడు అతి వృష్టిలా మారిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. విపక్షాలు చేసే విమర్శలకు సరైన సమాధానం చెప్పడం లేదని, కౌంటర్ ఇవ్వడానికి కూడా సమయం లేదా? అని మంత్రులను చంద్రబాబు ప్రశ్నించడంతో ఇక వేగంగా రియాక్ట్ అవుతున్నారు అమాత్యులు. చంద్రబాబు హెచ్చరికలతో తమ పదవి ఎక్కడ ఊడుతుందేమోనన్న భయం వారిని పరుగులు పెట్టిస్తుంది. జగన్ మీడియా సమావేశం తర్వాత... నిన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ అలా మీడియా సమావేశం పెట్టి ప్రభుత్వంపై విమర్శలు, హామీలు అమలు చేయలేదని, అధికారులకు, చంద్రబాబు వార్నింగ్ లు ఇస్తూ చేయడంపై వెనువెంటనే మంత్రులు రియాక్ట్ అయ్యారు. పోటీ పడి మరీ మీడియా సమావేశాలు పెట్టి జగన్ ను ఒక ఆటాడుకున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు దాదాపు మంత్రులు ఎక్కడ పర్యటనలో ఉన్నప్పటికీ కొందరు హడావిడిగా అమరావతికి వచ్చి పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశాలు పెడితే మరికొందరు తమ జిల్లా కేంద్రం నుంచి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్ విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఇందుకోసం జగన్ మీడియా సమావేశాన్ని మొత్తం చూసి అందులో ప్రభుత్వంపైనా, చంద్రబాబుపైన చేసిన విమర్శలను ఖండించార. అయితే మంత్రుల విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు వారికి ఉద్వాసన తప్పదని మాత్రం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో అత్యధిక మంది గెలవడంతో అందరికీ అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో భాగంగా ఖచ్చితంగా మంత్రివర్గ విస్తరణ జరుపుతారని అంటున్నారు. అయితే అది ఎప్పుడనేది ఇప్పుడు చెప్పలేకపోయినా రెండేళ్లు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేస్తారా? లేదా ముందుగానే చేపడతారా? అన్నది మాత్రం తెలియక అమాత్యులు ఆందోళనలోనే ఉన్నారు. మూడు రోజుల క్రితం చంద్రబాబు రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ ను కలిశారు. మర్యాదపూర్వకంగానే గవర్నర్ ను కలిసినా విస్తరణకు సంబంధించి అన్న అనుమానంతో మంత్రులు ఒకింత ఆందోళనకు గురయ్యారని తెలిసింది. కేవలం ప్రతిపక్ష పార్టీ విమర్శలకు మాత్రమే కౌంటర్ ఇచ్చి ఊరుకుంటే సరిపోదంటున్నారు. మంత్రుల బాధ్యతలు చాలా ఉన్నాయి. శాఖలపై పట్టు సంపాదించుకోవడంతో పాటు నిరంతరం ప్రజల్లో తిరుగుతూ తమ శాఖకు సంబంధించిన నిధులు ఏమేం ఖర్చు పెట్టారు? ప్రభుత్వం ఇప్పటి వరకూ ఏడాది కాలంలో చేసిన మంచిపనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కూడా వివరించాలి. దీనికి తోడు ముఖ్యమైనది కార్యర్తలను కలుపుకుని పోవడంతో పాటు తమకు కేటాయించిన జిల్లాల్లో కూటమి పార్టీలు, తెలుగుదేశం పార్టీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించడంలో విఫలమవ్వడాన్ని కూడా చంద్రబాబు పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశాలున్నాయంటున్నారు. అందుకే మంత్రులు కేవలం కౌంటర్లు మాత్రమే కాదు...కాంట్రావర్సీలు లేకుండా చేయడంలో కూడా సత్తా చూపాల్సి ఉంటుందట.

# నేత్రపర్వంగా అప్పన్న సహస్ర నామార్చన

విశాఖపట్నం,శ్రీ శ్రీ శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి సహస్ర నామార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపం లో అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. తదుపరి స్వామివారి అంతరాలయ దర్శనమునకు అనుమతించారు

# అడ్డంగా ఇరుక్కున్న వినూత

తిరుపతి, జూలై 18,సూక్ష్మ పరిమాణంలో ఉండే చీమ భారీగా ఉండే ఏనుగు.. గొప్పగా ఆలోచించే మనిషి.. ఎవరిదైనా ప్రాణమే. ఆ ప్రాణానికి ప్రమాదం ఏర్పడితే.. ఆ ప్రాణం గాలిలో కలిసిపోతే తిరిగి తీసుకురావడం కష్టం. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితేనే చాలా బాధపడిపోతాం.. ప్రాణం పోయిందని కన్నీరు పెడతాం. మనుషులే కాదు జంతువులు కూడా తమ తోటి జంతువుల ప్రాణాలు పోతే కన్నీరు పెడతాయి. గుండెలు అవిసే విధంగా రోదిస్తుంటాయి. ప్రమాదవశాత్తు ప్రాణాలు పోతేనే అలా ఉంటే.. కావాలని ప్రాణాలు తీస్తే ఎలా ఉంటుంది.. ప్రాణాలు కోల్పోతున్న వ్యక్తి బాధ ఎలా ఉంటుంది? వ్యక్తిని కోల్పోయిన ఆ కుటుంబం బాధ ఎలా ఉంటుంది? అలాంటి కష్టం పగవారికి కూడా రావద్దు అనిపిస్తుంది కదా..నమ్మిన పాపానికి.. ఇన్ని సంవత్సరాలపాటు నమ్మిన బంటుగా ఉన్న పాపానికి రాయుడు అనే యువకుడిని శ్రీకాళహస్తి గ్లాస్ పార్టీ మాజీ ఇంచార్జ్ కోట వినూత, ఆమె భర్త, ఇంకా కొంతమంది వ్యక్తులు అంతం చేశారు.. అంతేకాదు అతడి మృతదేహాన్ని చెన్నైలో పడేశారు. అతడిని అంతం చేసిన తర్వాత ఏదో ఘనకార్యం చేసినట్టు వినూత, ఆమె భర్త భారీ వాహన శ్రేణి మధ్య సొంత ప్రాంతానికి వచ్చారు. శ్రీనివాస రాయుడు చేతి మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా చెన్నై పోలీసులు ఈ కేసును చేదించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో వినూత, ఆమె భర్త, ఇతర నిందితులు ఉన్నారు. పోలీసుల విచారణలో వారు చెబుతున్న విషయాలు సంచలనంగా మారుతున్నాయి. పనిలో పనిగా ఫ్యాన్ పార్టీ అనుకూల మీడియా మరిన్ని విషయాలను రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే శ్రీనివాసరాయుడు సోదరి, నానమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి కొన్ని కీలక విషయాలను రాబట్టింది.శ్రీనివాస రాయుడు సోదరిని పోలీసులు విచారణ నిమిత్తం పిలిచారు. పోలీసులు కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి ఆమె స్పష్టంగా సమాధానం చెప్పింది. తన వద్ద ఉన్న ఆధారాలు కూడా ఇచ్చింది. ఇదే క్రమంలో పోలీసుల విచారణ అనంతరం బయటికి వచ్చిన ఆమె విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది.." శ్రీనివాస రాయుడిని అంతం చేసిన తర్వాత ఈ విషయం మాకు తెలిసింది. మాకు కోట వినూత నుంచి ఫోన్ వచ్చింది. 30 లక్షలు ఇస్తాం.. ఈ విషయాన్ని మర్చిపో అన్నారు. దానికి మేము లొంగలేదు. మాకు డబ్బు అవసరం లేదు. వినుత చెప్పినట్టు మా సోదరుడు ప్రత్యర్థి పార్టీ వద్ద డబ్బు తీసుకొని ఉంటే.. అది ఎక్కడికి వెళ్ళింది? ఆ డబ్బు ఏ ఖాతాలో ఉంది? ఒకవేళ ఆయన డబ్బు ఇస్తే ఏ రూపంలో ఇచ్చాడు? ఇవన్నీ మాకు తెలియాలి. మా విషయంలో పవన్ కళ్యాణ్ జ్యోక్యం చేసుకోవాలి. న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. మేము న్యాయం కోసం మాత్రమే పోరాడుతున్నాం.. సోదరుడి ప్రాణానికి వెల కడుతున్నారు. ఇటువంటి పద్ధతి మంచిది కాదని" శ్రీనివాస రాయుడు సోదరి విలేకరులతో పేర్కొంది. ఇక దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. మొత్తంగా ఈ వ్యవహారంలో వినూత, ఆమె భర్త మరింత ఇరుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది.ఇక ఇప్పటి సోషల్ మీడియా కాలంలో కొంతమంది రాజకీయ నాయకులు తాము చేసిన తప్పుల వల్ల తమ పొలిటికల్ లైఫ్ నే కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇంచార్జి కోటా వినూత తన వద్ద గతంలో పనిచేసిన మాజీ డ్రైవర్ ను అంతం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినూత పేరును శ్రీనివాసరాయుడు తన చేతి మీద పచ్చబొట్టు పొడిగించుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆ పచ్చబొట్టు ఆధారంగానే చెన్నై పోలీసులు శ్రీనివాసరాయుడు కేసులో కీలక పురోగతి సాధించారు. ఆ తర్వాత ఏం జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కోటా వినూత చేసిన తప్పు వల్ల ఆమె రాజకీయ జీవితమే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది..గతంలో వైసిపిలో ఉన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా దివ్వెల మాధురితో ఏర్పరచుకున్న సంబంధం వల్ల అభాసుపాలయ్యారు. ఆయన చేస్తున్న వ్యవహారాల వల్ల కుటుంబ సభ్యులు ఈసడించుకున్నారు. గొడవ కూడా పడ్డారు.. చివరికి దువ్వాడ శ్రీనివాస్ వారి మీద గొడవ కూడా దిగారు.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పంచాయతీ జరగడంతో శ్రీనివాస్ రాజకీయ జీవితం ఒక్కసారిగా మారిపోయింది. ఇక ఇటీవల ఆయన కొనసాగుతున్న పార్టీ నుంచి సస్పెండ్ కావలసి వచ్చింది. దీంతో ఇప్పుడు ఆయన రాజకీయ జీవితం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఎప్పుడు ఎటువంటి మలుపు తీసుకుంటుందో తెలియడం లేదు..కోటా వినూత, దువ్వాడ శ్రీనివాస్ మాత్రమే కాదు.. ఇంకా చాలామంది రాజకీయ నాయకులు ఇటువంటి తెరచాటు బంధాల వల్ల తమ పొలిటికల్ లైఫ్ కోల్పోయారు. నాయకుల తెరచాటు సంబంధాలను వారి దగ్గర వ్యక్తులే బయటికి తెలిసేలా చేయడం విశేషం. ఆ వ్యవహారాలను వివిధ రూపాలలో ప్రత్యర్థులు బయట పెట్టడం గమనార్హం.కోట వినూత ఫైర్ బ్రాండ్ గా శ్రీకాళహస్తి ప్రజలకు సుపరిచితమే. పైగా వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నిరసన కార్యక్రమాలు అప్పట్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచాయి.

# డ్రైనేజ్ కాలువలో పడేసిన నవజాత మగ శిశువు మృతి.

అనకాపల్లి , చోడవరం మండలం అంబేరిపురం గ్రామంలో నవజాత శిశువును మురుకు కాలవలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట పడేశారు పూర్తిగా అవయవాలతో పుట్టిన శిశువును కాలువలో ఉండడం చూసిన గ్రామస్తులు సమాచారం తెలుసుకున్న చోడవరం సీఐ అప్పలరాజు తన సిబ్బందితో దర్యాప్తు చేస్తున్నారు అనకాపల్లి డిఎస్పి శ్రావణి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు పంచాయతీ, రెవెన్యూ వైద్యాధికారులు అంగనవాడి,ఆశా కార్యకర్తల తో విచారణ చేస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గర్భిణీ స్త్రీలు నేరేడు పండ్లు తింటే ఏం జరుగుతుందో తెలుసా..?



వేసవి చివర్లో, వర్షాకాలం ప్రారంభంలో లభించే నేరేడు పండ్లు కేవలం రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఈ చిన్న పండ్లు పోషకాల గని అని చెప్పవచ్చు. వీటిలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్య ప్రయోజనాలు: మధుమేహ నియంత్రణ: నేరేడు పండ్లు రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వీటిలోని జంబోలిన్ అనే గ్లైకోసైడ్ శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. “సమోస, కచోరీ, వడపావ్.. తెగ తింటున్నారా?–కేంద్రం వార్నింగ్” జీర్ణక్రియ మెరుగు: అధిక ఫైబర్ ఉండటం వల్ల జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. రక్తహీనత నివారణ: ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల రక్తహీనతతో బాధపడేవారికి చాలా ఉపయోగకరం. రోగనిరోధక శక్తి పెంపు: విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తాయి. గుండె ఆరోగ్యం: పొటాషియం రక్తపోటును నియంత్రించి, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. చర్మ సౌందర్యం: యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి. గర్భిణీ స్త్రీలు తినవచ్చా? సాధారణంగా, గర్భిణీ స్త్రీలు నేరేడు పండ్లను మితంగా తినవచ్చు. వీటిలోని పోషకాలు తల్లికి, బిడ్డకు మేలు చేస్తాయి. ముఖ్యంగా ఐరన్, విటమిన్ సి గర్భధారణ సమయంలో చాలా అవసరం. అయితే, ఏ ఆహార పదార్థమైనా అతిగా తీసుకోకూడదు. గర్భధారణ సమయంలో ఏవైనా కొత్త ఆహారాలు తీసుకునే ముందు, లేదా ఏవైనా సందేహాలుంటే మీ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. కొంతమందికి నేరేడు పండ్ల వల్ల స్వల్పంగా కడుపు నొప్పి లేదా అసౌకర్యం కలగవచ్చు కాబట్టి, జాగ్రత్తగా ఉండాలి.

# రీల్స్ అతిగా చూస్తున్నారా? అయితే మీ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్టే!



ప్రస్తుతం చాలామంది సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ టైంపాస్ చేస్తున్నారు. ఒక లెక్కలో చెప్పాలంటే రీల్స్ చూడడం అనేది ఒక వ్యసనంగా మారింది. ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్రపోయే వరకు అదే పనిగా ఫోన్లో తలపెట్టి రీల్స్ చూస్తున్న వారు లేకపోలేదు. రీల్స్ చూడడం వల్ల కంటి ఆరోగ్యం దెబ్బ రీల్స్, షార్ట్స్ వంటి వీడియోలను గంటలు తరబడి చూస్తున్న చాలామంది వారికి తెలియకుండానే ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. రీల్స్ చూడడం వల్ల కంటి ఆరోగ్యం దెబ్బతింటుంది. రీల్స్ ని అతిగా చూసే అలవాటు ఉన్నవారు తీవ్ర అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రీల్స్ ఎక్కువగా చూడటం వల్ల మానసిక స్థితి కూడా తీవ్రంగా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. డిజిటల్ ఒత్తిడి ఒక నిశ్శబ్దపు మహమ్మారి అదేపనిగా కంటిన్యూగా స్క్రీన్ చూడడం వల్ల కనురెప్పల కొట్టడం తగ్గుతుందని, ఫలితంగా కళ్ళు పొడిబారడం, చూపు మందగించడం, మైగ్రేన్, నిద్రలేమి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. రీల్స్ షాట్స్ చూస్తున్న వారి సంఖ్య రోజు రోజు పెరుగుతున్న క్రమంలో కళ్ళ పైన పడే ఈ డిజిటల్ ఒత్తిడి ఒక నిశ్శబ్దపు మహమ్మారిలా కంటిచూపును దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక కంటి సమస్యలు, శాశ్వత కంటి సమస్యలు గంటలు తరబడి రీల్స్ చూడడం వల్ల ఇటు పిల్లల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, కళ్లు పొడిబారిపోవడం,హ్రస్వ దృష్టి పెరగడం, చిన్న వయసులోనే మెల్లకన్ను వచ్చే సమస్య కూడా పెరుగుతుందని, పిల్లలను సాధ్యమైనంత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. ఈ అలవాటును నియంత్రించలేకుంటే దీర్ఘకాలిక కంటి సమస్యలు, శాశ్వత కంటి సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. రీల్స్ చూడటం తగ్గించాలంటే ఇలా చెయ్యండి రీల్స్ చూడటం ఒక్కసారే మానుకోలేకున్నా నిదానంగా చూడటం తగ్గించాలి. ఇక మొబైల్ చూసినా, ల్యాప్ టాప్ చూసినా, ఏది చూసినా సరే 20–20–20 రూల్ పాటించాలి. 20 నిముషాలకు ఒకసారి 20 సెకన్ల పాటు చూడాలి. ఇలా అలవాటు చేసుకోవటం వలన కొంతమేర రీల్స్ పిచ్చి నుండి బయటపడవచ్చు. కంటి ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# బాత్రూమ్ కాంపింగ్ గురించి తెలుసుకోకపోతే మీ కొంప కొల్లేరే ..!

బాత్రూమ్ కాంపింగ్ అనే పదం వినడానికి కొత్తగా అనిపించవచ్చు, కానీ ఇది చాలా మందికి తెలియకుండానే చేసే ఒక అలవాటు. సాధారణంగా, ఇది బాత్రూమ్‌లో ఎక్కువ సమయం గడపడాన్ని సూచిస్తుంది. ఇది కేవలం శుభ్రత కోసం కాకుండా, కొన్నిసార్లు వ్యక్తిగత స్థలం కోసం లేదా ఒత్తిడిని తగ్గించుకోవడానికి చేసే చర్యగా కూడా ఉంటుంది. ఆధునిక జీవనశైలిలో, బాత్రూమ్ అనేది కేవలం అవసరాల కోసం మాత్రమే కాకుండా, కొంతమందికి ఒక వ్యక్తిగత ఆశ్రయంగా మారుతుంది. బయటి ప్రపంచం నుండి కాసేపు దూరంగా ఉండి, ప్రశాంతంగా తమతో తాము గడపడానికి ఇది ఒక ప్రదేశం. స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు వచ్చాక, ఈ “కాంపింగ్” మరింత పెరిగింది. చాలా మంది ఫోన్‌లో వీడియోలు చూస్తూ, సోషల్ మీడియా బ్రౌజ్ చేస్తూ లేదా గేమ్స్ ఆడుతూ బాత్రూమ్‌లో గంటల తరబడి గడిపేస్తుంటారు. జిల్లాల వారీగా ఇలా..!” ఇది మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి, ఆలోచనలకు సమయం ఇవ్వడానికి లేదా కేవలం ఒంటరిగా ప్రశాంతంగా ఉండటానికి ఒక మార్గం కావచ్చు. అయితే, అతిగా బాత్రూమ్‌లో సమయం గడపడం కొన్నిసార్లు కుటుంబ సభ్యులతో సమస్యాత్మకంగా మారవచ్చు లేదా ఇతర పనులను ఆలస్యం చేయవచ్చు. కాబట్టి, బాత్రూమ్ కాంపింగ్ అనేది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, మనసు ప్రశాంతత కోసం చేసే ఒక చిన్న ప్రయత్నంగా కూడా మనం చూడవచ్చు.



# నానబెట్టిన మెంతులు తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

3 అరచేతిలో ఇమిడిపోయే చిన్న మెంతి గింజలు... కేవలం వంటకాలకు రుచిని మాత్రమే కాదు, మీ ఆరోగ్యానికి అద్భుతమైన సంపదను అందిస్తాయి. ముఖ్యంగా, వీటిని రాత్రంతా నానబెట్టి ఉదయం పరగడుపున తినడం వల్ల ఎన్నో అనూహ్యమైన ప్రయోజనాలను పొందవచ్చు. పూర్వకాలం నుండి ఆయుర్వేదంలో దీనికి ఉన్న ప్రాముఖ్యత అపారం. నానబెట్టిన మెంతులు జీర్ణవ్యవస్థకు ఒక వరం. వీటిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఉదయం పూట వీటిని తీసుకోవడం వల్ల ప్రేగు కదలికలు మెరుగుపడి, శరీరం నుండి విష పదార్థాలు బయటపడతాయి. ముఖ్యంగా, మధుమేహంతో బాధపడేవారికి ఇది ఒక దివ్య ఔషధం. మెంతులలో ఉండే సాల్యుబుల్ ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో



సహాయపడుతుంది, ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి మెంతులు ఒక అద్భుతమైన ఎంపిక. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన ఆహార కోరికలు తగ్గుతాయి. ఇది శరీరంలో మెటబాలిజంను వేగవంతం చేసి, కొవ్వును కరిగించడంలో తోడ్పడుతుంది. మహిళలకు అయితే, నానబెట్టిన మెంతులు రుతుక్రమ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి, పాలిచ్చే తల్లులకు పాలు ఉత్పత్తిని పెంచుతాయి. వీటిలోని ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది. ఖనీలివతీవట ఃఎ జుట్టు రాలడాన్ని తగ్గించడంలో, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో కూడా మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే, చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా మెంతుల పాత్ర గణనీయం. ప్రతిరోజూ ఉదయం చిన్న కప్పు నానబెట్టిన మెంతులను తీసుకోవడం ద్వారా మీ ఆరోగ్యంలో అద్భుతమైన మార్పులను గమనించవచ్చు. ఈ చిన్న గింజల శక్తిని తక్కువ అంచనా వేయకండి, మీ దైనందిన ఆహారంలో వీటిని భాగం చేసుకోండి, ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించండి!

# యాంటీ బయాటిక్స్ అధికంగా వాడుతున్నారా? పొంచి ఉన్న పెను ప్రమాదం

యాంటీబయాటిక్స్.. మన ఆరోగ్యానికి అత్యంత ప్రమాదంగా మారుతున్న టువంటి పరిస్థితి ఉంది. ముఖ్యంగా గ్రామాలలో యాంటీబయాటిక్స్ వినియోగం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తుంది. చిన్నచిన్న అనారోగ్యాలకు సైతం యాంటీ బయాటిక్స్ వినియోగించడం గ్రామాలలో ప్రధానంగా కనిపిస్తుంది. యాంటీ బయాటిక్స్ వాడకం గురించి గ్రామాలలో సరైన అవగాహన లేకపోవడం కారణంగా, ప్రజలు వాటి గురించి తెలియక విపరీతంగా వినియోగిస్తున్నారు. విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడకం అంతేకాదు జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు కూడా యాంటీబయాటిక్స్ ను ఉపయోగిస్తే త్వరగా ఉపశమనం కలుగుతుందని భావించి వాటిని వాడుతున్నారు. ఇంకా కొన్ని గ్రామాలలో ఇప్పటికీ సరైన వైద్య సహాయం లేకపోవడం వల్ల మెడికల్ షాపులలో అడిగి యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి వాటిని వినియోగిస్తున్న పరిస్థితులు ప్రస్తుతం గ్రామాలలో ఉన్నాయి. అయితే ఇది ఏమాత్రం మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ సమస్య వీటివల్ల అనేక దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. విపరీతంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల బాక్టీరియా అభివృద్ధి చెందినప్పుడు యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ సంభవిస్తుంది, ఫలితంగా మనం వాడిన మందులు




ప్రభావవంతంగా ఉండవు. గ్రామీణ ప్రాంతాలలో, ఇది యాంటీబయాటిక్స్ అధిక వినియోగం ఒక ముఖ్యమైన సమస్యగా మారుతోంది. ఈ ప్రాంతాలలోని అనేక మంది ప్రజలు ప్రిస్క్రిప్షన్‌ల లేకుండా స్థానిక ఫార్మసీలపై ఆధారపడి ఇష్టారాజ్యంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల ఇది రెసిస్టెన్స్ ప్రమాదాన్ని పెంచుతుంది. యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల అనేక దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి. కొన్ని రకాల యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ కు కారణమవుతాయి. వాంతులు, విరోచనాలు, వికారం, ఎలర్జీ వంటి ఇతర సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇక అవసరం లేనప్పుడు యాంటీబయాటిక్స్ వాడడం అనవసరమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. నిజంగా అవసరం అయినప్పుడు యాంటీబయాటిక్స్ సరిగా పనిచేయని పరిస్థితి వస్తుంది. ఇది అనవసరమైన వైద్య ఖర్చులకు కారణంగా మారుతుంది. ఈ హెల్త్ బెనిఫిట్స్ తెలిస్తే గోరింటాకు వెతికి తెచ్చుకుని మరీ పెట్టుకుంటారు గ్రామాల్లో యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించేలా ఇలా చెయ్యాలి ముఖ్యంగా గ్రామాలలో ఉన్నటువంటి ఈ సమస్యను తగ్గించడానికి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలను యాంటీబయాటిక్స్ వాడకం విషయంలో చైతన్యవంతుల్ని చేయాలి. అంతేకాదు గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మెరుగుపరిచి, మెడికల్ షాపులలో నేరుగా మందులు ఇచ్చే విధానాన్ని అరికట్టాలి. వైద్య సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

# దానిమ్మ తొక్కే కదా అని పారేస్తున్నారా? ఈ బెనిఫిట్స్ తెలిస్తే వదిలిపెట్టరు!

దానిమ్మ గింజలు మాత్రమే కాదు దానిమ్మ తొక్కలు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి. చాలామంది దానిమ్మ గింజలు ఒలిచిన తర్వాత తొక్కలను పడేస్తూ ఉంటారు. అయితే దానిమ్మ గింజలలో, మాత్రమే కాదు తొక్కలలో ఉండే పోషకాలు మనకు బాగా ఉపయోగపడతాయి. దానిమ్మ తొక్కలలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్ మరియు ఖనిజాలు ఉంటాయి. దానిమ్మ తొక్కలతో చాలా బెనిఫిట్స్ దానిమ్మ తొక్కలను మన ఆహారంలో భాగంగా చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దానిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడిలా చేసుకుని టీ చేసుకుని తాగవచ్చు. అంతేకాదు దానిమ్మ తొక్కల నుండి తీసిన సప్లిమెంట్లను కూడా మనం తీసుకోవచ్చు. దానిమ్మ తొక్కల పొడిని నీళ్లలో కలిపి పేస్టులా చేసి చర్మానికి, జుట్టుకి రాసుకుంటే కూడా మంచి ఫలితాలు ఉంటాయి. అసలు దానిమ్మ తొక్కలతో ఎటువంటి ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయి అనేది ప్రస్తుతం చూద్దాం. దానిమ్మ తొక్కలతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు దానిమ్మ తొక్కలతో



జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దానిమ్మ తొక్కల లోని ఫైబర్ మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పేగు కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. దానిమ్మ తొక్కలు గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, శరీరంలోని కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి బాగా పనిచేస్తాయి. దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలో మంటను తగ్గించడానికి కూడా దోహదం చేస్తాయి. దానిమ్మ తొక్కలతో అందం, ఆరోగ్యం దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోట్లో బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రిస్తాయి. దంత సమస్యలను నివారిస్తాయి. దానిమ్మ తొక్కలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో బాగా పనిచేస్తాయి. చుండ్రు నివారించడానికి, జుట్టు రాలకుండా ఉండడానికి పేస్టులా చేసుకుని తలకు పెట్టుకుంటే మంచిది. ఇక దానిమ్మ తొక్కలను టీ గా గాని, పొడిగా గాని చేసుకొని ఆహారంలో భాగంగా తీసుకోవడం చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.




# ఆగస్ట్‌లో రాజాసాబ్ ఫస్ట్ సింగిల్

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ప్రభాస్‌కి ఉన్న స్థానం ప్రత్యేకమైనది. 'బాహుబలి' తర్వాత ఆయన సెలబ్రిటీ- స్టేటస్ అంతర్జాతీయంగా పెరిగింది. దీంతో ఆయన ప్రతి సినిమా మీదా అభిమానుల్లో, ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన అంచనాలు నెలకొంటున్నాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మాస్ ఎంటర్-టైనర్ 'ది రాజా సాబ్' మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ నుండి రీసెంట్‌గా విడుదలైన టీజర్‌లో ప్రభాస్ విభిన్న లుక్స్‌తో, కామెడీ, హీరోయిజం రెండు చూపించి అంచనాలు రెట్టింపు చేశాడు. మారుతి ప్రభాస్‌తో ఏదో అద్భుతం చేస్తున్నాడు అని క్లియర్‌గా అర్థం అవుతుంది. ఇందులో మాళవిక మోహన్, నిధి అగర్వాల్,రిద్ధి కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా, తాజాగా ఈ మూవీ నుంచి ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ బయటికి వచ్చింది. అదే ఫస్ట్ సింగిల్ గురించి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'ది రాజా సాబ్' నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఆగస్ట్ మొదటి వారంలో విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది. ఇది ప్రభాస్ పైనే డిజైన్ చేసిన సోలో మాస్ సాంగ్ అని సమాచారం. ప్రస్తుత టాలీవుడ్ ట్రెండ్‌ను బట్టి చూస్తే, థమన్ సాగే మాస్ బీట్, విజువల్స్‌తో ఈ పాటకు మంచి వర్షన్ వచ్చే అవకాశం ఉందట. ఇటీ-వలే విడుదలైన టీజర్‌కి మాస్ రెస్పాన్స్ రాగా, థమన్ అందించిన మ్యూజిక్‌కి ప్రత్యేకంగా ప్రశంసలు లభించాయి. ఇదే ఊపులో, తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం ప్రభాస్‌పై ప్రత్యేకంగా తెరకెక్కిన సోలో సాంగ్‌కు కూడా, తన మాస్ మేజిక్‌ని చూపించబోతున్నారట.




# ఏ సినిమాలో నటించకున్నా హిట్ కొట్టబోతున్నా

## బాహుబలి రీ రిలీజ్ పై రానా వ్యాఖ్య






రాజమౌళి సృష్టించిన కలాఖండం బాహుబలి మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 31న దీన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. అయితే రెండు పార్టులను కలిపి ఒకే దాంట్లో చూపిస్తామని ఇప్పటికే రాజమౌళి ప్రకటించారు. రెండు పార్టులు అంటే రన్ టైమ్ భారీగా ఉంటుందనే ప్రచారం మొదలైంది. కొందరేమో 5 గంటలు ఉంటుందని.. ఇంకొందరేమో 4 గంటలకు పైగా ఉంటుందని పోస్టులు పెడుతున్నారు. మరీ అన్ని గంటలు అంటే థియేటర్లలో ప్రేక్షకులు చూస్తారా అంటూ నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. ఈ టైమ్ లో హీరో రానా స్పందించారు. ఆయన నిర్మాతగా వ్యవహరించిన 'కొత్తపల్లిలో ఒకరోజు' మూవీ 18న రిలీజ్ కాబోతోంది. రానా వరుసగా ప్రమోషన్లలో పాల్గొంటున్నాడు.ఓ ఇంటర్వ్యూలో బాహుబలి రన్ -టైమ్ గురించి ప్రశ్న ఎదురవగా స్పందించాడు. 'రన్ టైమ్ ఎంత ఉన్నా నాకు హ్యాపీనే. ఎందుకంటే నేను ఈ ఏడాది ఎలాంటి సినిమాలు చేయకపోయినా నాకు బ్లాక్ బస్టర్ రాబోతోంది. కొందరేమో 5 గంటలు అంటూ పోస్టులు పెడుతున్నారు. అన్ని గంటలు ప్రేక్షకులు సీట్లలో కూర్చుంటారా లేదా అన్నది సందేహమే. కానీ రాజమౌళి ఏం చేసినా ఆలోచించే చేస్తారనే నమ్మకం నాకుంది. రన్ టైమ్ గురించి నాకు ఎలాంటి క్లారిటీ లేదు. దాని గురించి రాజమౌళికే తెలియాలి. ఆయన నాకేం చెప్పలేదు. రన్ -టైమ్ విషయంలో ఎలాంటి టె-న్షన్ పడాల్సిన అవసరం లేదు. ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకునే రాజమౌళి డిజైన్ చేస్తారు అంటూ తెలిపాడు. అక్టోబర్ 31న ది బాహుబలి-ఎపిక్ పేరుతో సినిమాను రిలీజ్ చేయబోతున్నారు. బాహుబలి రెండు పార్టుల్లోని కథకు ఎక్కడా భంగం కలగకుండా ఒకే సినిమాగా తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# తల్లిదండ్రులైన కియారా, సిద్దార్థ దంపతులు



బాలీవుడ్ స్టార్ కపుల్ కియారా అద్వానీ మరియు సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు తల్లిదండ్రులయ్యారు. మంగళవారం రాత్రి నటి కియారా అద్వానీ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ముంబైలోని హెచ్.ఎన్. రిలయన్స్ ఆసుపత్రిలో కియారా ప్రసవించినట్లు బాలీవుడ్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. ఇక కియారా, సిద్ధార్థ్ తల్లిదండ్రులు అవ్వడంతో వారికి బాలీవుడ్ ప్రముఖులతో పాటు సన్నిహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.తాము తల్లిదండ్రులైన విషయాన్ని కియారా-సిద్ధార్థ్‌లు సోషల్ మీడియాలో తెలుపుతూ.. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి, మా ప్రపంచం పూర్తిగా మారిపోయింది. మాకు ఒక ఆడపిల్ల పుట్టింది, ఇది నిజంగా దేవుడిచ్చిన వరం అంటూ ఈ జంట రాసుకోచ్చింది. షేర్షా' సినిమా టైంలో ప్రేమలో పడిన ఈ జంట 2023 ఫిబ్రవరిలో పెళ్లి చేసుకుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 28న తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు- కియారాతో పాటు- సిద్ధార్థ్ మల్హోత్రా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. సినిమాల విషయానికి వస్తే.. కియారా ప్రస్తుతం హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో వస్తున్న వార్ 2 చిత్రంలో నటిస్తుంది. సిద్ధార్థ్ మల్హోత్రా జాన్వీ కపూర్‌తో కలిసి పరమ్ సుందరి అనే సినిమాలో నటిస్తున్నాడు.

# ఓటిటికి రెడీ అవుతున్న తమ్ముడు




వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న నితిన్.. ఈసారి కెరీర్‌లో నిలబడాలంటే ఖచ్చితంగా హిట్ కొట్టాలనే ఉద్దేశంతో 'తమ్ముడు' సినిమాకు ఓకే చెప్పారు. కానీ దర్శకుడు వేణు శ్రీరామ్ తెరకెక్కించిన ఈ మూవీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వర్ష బొల్లమ్మ – సప్తమి గౌడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం, జూలై 4న థియేటర్లలో విడుదలై మిక్స్డ్ టాక్‌తో కలెక్షన్ల పరంగా బలహీనపడింది. ఈ మూవీతో హిట్ కొట్టాలని అనుకున్న నితిన్ కలలు కల్లలయ్యాయి. బాక్సాఫీస్ జర్నీ ప్రారంభించినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఈ చిత్రం పాజిటివ్ రిజల్ట్ చూపించలేకపోయింది. కీలకమైన వీకెండ్‌లోనూ కనీస కలెక్షన్ కూడా రాలేదు. దీంతో, చిత్రబృందం త్వరగానే ఓటీటీ రిలీజ్‌కు మారుతున్నట్లు- తెలుస్తోంది. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.



# వార్-2పై పెరుగుతున్న అంచనాలు

## డిఫరెంట్ రోల్‌తో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ

ఆడియన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో హృతిక్ రోషన్, -టైగర్ ష్రాఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మూవీ భారీ హిట్ అయ్యింది. అదే సిరీస్‌కు ఇది సీక్వెల్. ఈసారి కథ మరింత ఇంటెన్స్‌గా ఉండబోతుందన్న అంచనాలు ఉన్నాయి. హృతిక్ మళ్లీ రా ఏజెంట్ మేజర్ కబీర్ ధాలివాల్ పాత్రలో కనిపించబోతుండగా, ఎన్టీఆర్ తొలిసారిగా హిందీ లో పెద్ద స్కోప్ ఉన్న ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా, అలాగే, యష్ రాజ్ ఫిలిమ్స్ అధినేత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇక కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ నుంచి, అభిమానుల ఎదురు చూపులకు చెక్ పెడుతూ తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి కౌంట్‌డౌన్ పోస్టర్ విడుదలై బజ్ పెంచింది. తాజాగా విడుదలైన ఈ కౌంట్‌డౌన్ పోస్టర్‌లో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. మాస్క్‌తో, టెన్నింగ్ గ్లాస్‌లు ధరించి, బ్లాక్ గేర్‌లో కనిపించిన ఎన్టీఆర్ లుక్ ఫ్యాన్స్‌కి ఫుల్ మాస్ హై ఇచ్చింది. ఆయన ఎక్స్ వేదికగా ఈ పోస్టర్‌ను పంచుకోవడం కూడా మరో హైలైట్. ఇక అభిమానులు 'విలన్ అయినా వీర్‌గా ఉన్నాడు', 'డార్క్ షేడ్స్‌లో ఎన్టీఆర్ ఓ రేంజ్' అంటూ కామెంట్లతో సోషల్ మీడియాలో ముంచెత్తుతున్నారు.






# షెడ్యూల్డ్ కులాల రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలి

**ఎస్ సి, ఎస్ టి అట్రాసిటి యాక్ట్ ఫిర్యాదుల పై వెంటనే స్పందించాలి**
**షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలి**
**జాతీయ ఎస్ సి కమిషన్ సభ్యుడు శ్రీ వడ్డేపల్లి రామచందర్**



విశాఖపట్నం(విజయ సారథి):అధికార యంత్రాంగం ఎస్ సిల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని జాతీయ ఎస్ సి కమిషన్ సభ్యుడు శ్రీ వడ్డేపల్లి రామచందర్ కోరారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలక్టర్ సమావేశ మందిరంలో ఎస్ సిల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతి పై జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా గౌరవ కమిషన్ సభ్యులు రామచందర్ మాట్లాడుతూ ఆర్టికల్ 338 ప్రకారం ఎస్ సి, ఎస్ టిలకు రావలసిన ప్రయోజనాలను డా. బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచా రన్నారు. జిల్లాలో ఉన్న 44 శాఖల అధికారులు ఎస్ సి లకు న్యాయం, మేలు చేసే దిశలో పని చేయాలన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎస్ సిల కోసం పూచి కత్తు లేకుండా 5 కోట్ల వరకు ఋణాలను 50 శాతం సబ్సిడీ ఇచ్చి స్వయం ఉపాధి పథకాలు అందిస్తున్నారన్నారు. బ్యాంకర్లు, అధికారులు ఎస్ సి, ఎస్ టి లలో స్వయం ఉపాధి పథకాలపై అవగాహన కల్పించి వారికి రావలసిన రుణాలు, ఉపాధి, ఉద్యోగాలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. కమిషన్ కు జ్యూడిషరీ అధికారాలు ఉంటాయని గుర్తించి పనిచేయాలన్నారు. సమీక్షా సమావేశంలో ముందుగా జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో ఎస్ సి లకు జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వసతి గృహాలు, పాఠశాలలు, ఎంతమంది ఎస్ సి పిల్లలు చదువుతున్నారు, జనాభా, ఇళ్ళ స్థలాలు కేటాయింపు, ఇళ్ళ మంజూరు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను కమిషన్ కు వివరించారు. ఎస్ టి అట్రాసిటి కేసులు, తీసుకుంటున్న చర్యలను పోలీసు కమీషనర్ శంఖ బ్రత భాగ్చి వివరించారు. అనంతరం రామచందర్ సమీక్ష చేస్తూ ఫిర్యాదు రాగానే పోలీసులు సకాలంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఒత్తిడులకు లొంగకుండా కమిషన్ దృష్టికి రాకముందే కేసులు పరిష్కరించాలన్నారు. కమిషన్ దృష్టికి వస్తే ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని పోలీసు అధికారులకు తెలిపారు. అట్రాసిటి కేసులకు సంబంధించిన ఆర్థిక సహాయం త్వరితగతిన అందజేయాలన్నారు. జిల్లాలో బాక్ లాగ్ పోస్టులు మూడు నెలలో భర్తీ చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచించారు. ఆంధ్ర యూనివర్సిటి లో గత నాలుగు సంవత్సరాలుగా బాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. మూడు నెలలులో భర్తీ చేసి నివేదికను కమిషన్ కు పంపాలని ఆంధ్ర యూనివర్సిటి రిజిస్ట్రారుకు సూచించారు. ఎస్ సి లకు ఎపిఐఐసి ద్వారా ప్లాట్లు, పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం 5 కోట్ల వరకు పూచీ కత్తులేని రుణాలను అందిస్తున్నదని, బ్యాంకర్లు ఈ రుణాలు ఎస్ సిలకు కూడా అందేలా చర్యలు తీసుకోవాలని, బ్యాంకుల ద్వారా ముద్ర, స్టార్టప్ ఇండియా, ఎంఎస్ఎంఇ రుణాలు ఎంత మేరకు ఇచ్చారో 15 రోజులలు లోపు నివేదిక పంపాలని ఎల్ డిఎంను ఆదేశించారు. ముందుగా కలక్టరేట్ కు చేరుకున్న కమిషన్ సభ్యుడు రామచందర్ కు జిల్లా కలక్టర్ హరెంధిర ప్రసాద్, పోలీసు కమీషనర్ శంఖ బ్రత భాగ్చి పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్ సిల నుండి పిటిషన్లు స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో నేషనల్ ఎస్ సి కమిషన్ డైరెక్టర్ డా. జి.సునీల్ కుమార్ బాబు, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి జిల్లా రెవిన్యూ అధికారి భవాని శంకర్, సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు రామారావు, కమిషన్ అధికారులు నవీన్, వరప్రసాద్, క్రాంతి కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే అంజిబాబు



సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు ను గురువారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పరామర్శించారు. సుబ్బరాజు తండ్రి వెంకట్రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రామరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..



భీమవరం జూలై 18 )పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ డీఎంహెచ్ఓ శ్రీమతి జి. గీత భాయ్ గారి నేతృత్వంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ ఆర్ సి ఎస్), పశ్చిమ గోదావరి సంయుక్తంగా ఒక రక్తదాన శిబిరంను నిర్వహించింది. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు వివిధ ఎన్జీఓల ప్రతినిధులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని అందరికీ ప్రేరణగా నిలిచారు. జిల్లాలో ప్రజారోగ్య సంరక్షణతో పాటు, వారు స్వయంగా రక్తదానం చేయడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.ఈ శిబిరంలో భీమవరం మరియు తణుకు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ల ద్వారా మొత్తం 25 యూనిట్లు రక్తం సేకరించబడింది. డీఎంహెచ్ఓ శ్రీమతి గీత భాయ్ గారు రక్తదానంలో పాల్గొన్న సిబ్బందిని అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ సి ఎస్.చైర్మన్ ఎం.ఎస్.వి.ఎస్. భద్రి రాజు, వైస్ చైర్మన్ వాబిలిశెట్టి కనక రాజు, డిస్ట్రిక్ట్ లెప్రసీ ఆఫీసర్ డాక్టర్.రవి, డిస్ట్రిక్ట్ ఎస్ ఏ సి ఎస్ ఆఫీసర్ శ్రీ మధు., ఐ ఆర్ సి ఎస్.సభ్యుడు జి.ఎం. కృష్ణ రావు పాల్గొన్నారు. .

## వెలగలేరు పోలేరమ్మకు ఆషాడం సారె



పెనుమంట్ర జులై 18 ఆషాడ మాసం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామ దేవత పోలేరమ్మకు బీసీ అండ్ ఈ. డబ్ల్యూ.ఎస్ ఫ్రీ టైలరింగ్ క్లాస్ సెంటర్ మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. వెలగలేరు గ్రామ పురవీధుల్లో పానకం కావడి, కుంకుమ,పసుపు, పువ్వులు, గాజులు పలు రకాల స్వీట్స్, పండ్లు ఫలవ ఖలతో ఊరేగింపుగా ఊరేగుతూ పోలేరమ్మ తల్లికి సారె సమర్పించి ధూప దీప నైవేద్యాలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఆషాడ మాసంలో అమ్మవారికి సారె సమర్పిస్తే వర్షాలు బాగా పడి పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు అమ్మవారి దీవెనలతో చల్లగా ఉంటారనేది తమ విశ్వాసం అన్నారు

## సంక్లిష్ట గుండె సమస్యలకు నూతన పరిష్కారం కనుగొన్న కెఎల్ యు పరిశోధనా విద్యార్థిని

తాడేపల్లి జూలై 18 కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంభందింత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలను కనుగొన్నట్లు కెఎల్ ఫార్మసీ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంభందింత వ్యాదులపై పరిశోధన చేసిన శ్రేయ కొసనం సాంప్రదాయ మొక్కల నుండి పలు రకాల గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషదాలు తయారు చేయవచ్చుననే నివేధికను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. అందుకు గాను శ్రేయ కొసనం కెఎల్ ఫార్మసీ కళాశాల నుండి పిహెచ్ డి డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ పరిభాషలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మా డైకోటోమా ఎగైనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా–రిపెర్ఫ్యూజన్ ఇంజురీ, ఇంటిగ్రేటింగ్ కంప్యుటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్ లైన్ వాలిడేషన్ యూజింగ్ హెచ్9సి2 కార్డియో మయోసైట్స్ అనే తన థీసిస్‌కు గాను కెఎల్ యు ఫార్మసీ కళాశాల వారు శ్రేయ కొసనమ్ కు పిహెచ్‌డి ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. సాంప్రదాయ ఔషధ మొక్కల నుండి నెట్‌వర్క్ ఫార్మకాలజీ ద్వారా బహుళ–లక్ష్య చికిత్సా వ్యూహాలను అభివృద్ధి చేయడంపై ఆమె పరిశోధన దృష్టి సారించినట్లు తెలిపారు. హెచ్9సి2 సెల్ నమూనాలలో ప్రయోగాత్మక ధ్రువీకరణతో గణన ✓ విధానాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమగ్ర అధ్యయనం సాంప్రదాయ వైద్యం, ఆధునిక ఔషధ శాస్త్రాన్ని వారధిగా చేసుకుని, సంక్లిష్ట గుండె పరిస్థితులను లక్ష్యంగా చేసుకుని మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన దిశలను అందిస్తుందన్నారు.

## విశాఖ వేదికగా స్కేటింగ్ అభివృద్ధికి కృషి

**దేశంలోనే అత్యుత్తమ స్కేటింగ్ రింక్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తాం**
**శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు.**
**విశాఖలో క్రీడల అభివృద్ధికి వీఎమ్ఆర్డీఏ పూర్తి సహకారం**
**వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**



విశాఖపట్టణం(విజయ సారథి):విశాఖపట్టణంలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు శాప్, వీఎమ్ఆర్డీఏలు కసరత్తుచేస్తున్నాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విశాఖలో రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ నిర్వహణకు అనుగుణంగా అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో స్కేటింగ్ రింక్,న్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు సంబంధించి వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ భగీరథతో కలిసి సంబంధిత శాఖాధికారులతో శుక్రవారం వీఎమ్ఆర్డీఏ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ 2027లో ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన సందర్భంగా విశాఖపట్టణంలో ఈ పోటీలను నిర్వహించేందుకు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందన్నారు. దానిలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అనుభవజ్ఞులైన నిష్ణాతులతో దేశానికే తలమానికంగా నిలిచేలాన్ఫ్రాస్ట్రక్చర్‌ను నెలకోల్పాలని, భవిష్యత్ తరాలు సైతం సద్వినియోగించుకునేలా నిర్మించాలని సూచించారు. దానికి సంబంధించి దేశంలోనే అత్యుత్తమ అనుభవమున్న ఆర్కిటెక్చర్లతో సంప్రదింపులు జరపాలని, తగిన సూచనలు, సలహాలు తెలుసుకోవాలని వివరించారు. దేశంలో క్రీడా నిర్మాణాల పట్ల అపారానుభవం ఉన్న సంస్థలను సంప్రదించాలన్నారు. అలాగే శాప్, వీఎమ్ఆర్డీఏ సంయుక్తంగా విశాఖ రుషికొండలో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో విశాఖ ప్రతిష్టత ప్రతిబింబించేలా స్కేటింగ్ క్రీడను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖలో క్రీడల అభివృద్ధికి వీఎమ్ఆర్డీఏ పూర్తిగా సహకరిస్తుందని, రుషికొండలోని వాటర్ స్పోర్ట్స్‌ను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు విశాఖపట్టణంలో క్రీడల అభివృద్ధికి సహకరిస్తున్న వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్‌ను వారి ఛాంబర్‌లో శాప్ ఛైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి విశాఖలో క్రీడల అభివృద్ధికి శాప్, వీఎమ్ఆర్డీఏ సంయుక్తంగా చేపట్టనున్న అంశాలపై చర్చించారు.ఉడా పార్కులోని స్కేటింగ్ రింక్ పరిశీలన..విశాఖ ఉడా పార్కులోని స్కేటింగ్ రింక్‌ను శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ శుక్రవారం పరిశీలించారు. తొలుత స్కేటర్లను పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. సందర్భంగా క్రీడాకారుల స్కేటింగ్ ప్రదర్శనను రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ భగీరథ, శాప్ డైరెక్టర్లతో కలిసి వీక్షించారు. అనంతరం స్కేటింగ్ రింక్‌లు, గ్యాలరీలను పరిశీలించి మరమ్మతుల నిర్వహణకు చర్యలు చేపడతామని తెలియజేశారు. స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు సంబంధించి వీఎమ్ఆర్డీఏ అధికారులతో ఫెడరేషన్ నిర్వాహకులు సమన్వయం చేసుకోవాలని శాప్ ఛైర్మన్ సూచించారు.జిప్ లైన్ పరిశీలన..విశాఖపట్టణంలోని పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిపై నిర్వహిస్తున్న జిప్ లైన్(రోప్ ఫ్లైయింగ్), అడ్వంచర్ గేమ్స్ ను శాప్ ఛైర్మన్ పరిశీలించారు. సందర్భంగా వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్‌తో కలిసి రోప్ ఫ్లైయింగ్ చేశారు. టూరిజంతోపాటు అడ్వంచర్ గేమ్స్‌ను ప్రోత్సహిస్తున్న వీఎమ్ఆర్డీఏకు స్పోర్ట్స్ అథారిటీ పూర్తిగా సహకరిస్తుందన్నారు. టూరిజంతోపాటు క్రీడల అభివృద్ధికి వీఎమ్ఆర్డీఏ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు పి.బి.వి.ఎస్.ఎన్.బుచ్చిరాజు, ఎమ్.డి.రమేష్ కుమార్, కొవ్వాసు జగదీశ్వరి, వీఎమ్ఆర్డీఏ ఛీఫ్ ఇంజినీర్ వినయ్ కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి

**నేటి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహణపై**
**అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం**



విశాఖపట్టణం(విజయ సారథి):అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మూడో శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై గురువారం రాత్రి నిర్వహించిన వీడియో సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒకసారి వినియోగించి పడవేసే ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు దశల వారీగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల జల, వాయు కాలుష్యంతో పర్యావరణానికి కలుగుతున్న హాని గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అంకితభావం ప్రదర్శించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పారిశ్రామిక తదితర ప్రాంతాల్లో ఈ నెల మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో, కార్యాలయాల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి ఫోటోలు, ఇతర నివేదికలు నివేదించాలని సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్ లో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలకు పి4 అమలలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

కాళ్ళ: జూలై 18 :పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పి4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కాళ్ల మండలం బొండాడ గ్రామంలో పి4 గ్రామసభను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇప్పటికే బొండాడ గ్రామంలో గుర్తించిన 128 బంగారు కుటుంబాలకు సంబంధించిన డేటాను గ్రామ సెక్రెటరీ గ్రామసభలో పేరుపేరునా చదివి వినిపించగా, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వారి యెక్క స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నాను. ఈ సందర్భంలో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బంగారు కుటుంబాలు జాబితాలో అనర్హులకు చోటు కల్పించకపోవడం ఎంత ముఖ్యమో, అర్హులను జాబితాలో చేర్చడం అంతే ముఖ్యం అన్నారు.

## ఔషధ మొక్కలతో ప్రజలకు ఆరోగ్యం

**ఎంఈఓ శ్రీనివాసరావు**

అద్దంకి జులై 18 :ఐఈఈఆర్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈఓ ఎ. శ్రీనివాసరావ మాట్లాడుతూ మన పూర్వీకులు ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచేందుకు ప్రకృతి సిద్ధమైన ఔషధ మొక్కలను నిత్య జీవితంలో భాగంగా చేసుకున్నారు. ఈరోజు మనం నాటుతున్న మొక్కలు రేపటి తరానికి ఆయురారోగ్యాన్ని అందించ గలవు. విద్యార్థుల్లో పచ్చదనంపై ప్రేమను పెంపొందించడమే కాదు, ఆయుర్వేదంపై ఆసక్తి కలిగించేలా ఇది మార్గదర్శక ంగా ఉంటుంది" అని తెలిపారు.పాఠశాల ఆవరణలో 30 వేర్వేరు రకాల ఔషధ మొక్కలు నాటారు. ఇందులో తులసి, అశ్వగంధ, బ్రాహ్మి, అలొవెరా, శతావరి, కాలమేఘ, మందార ఎర్రచందనం శ్రీగంధం విటమిన్స్ వామ్మకు అల్లం ఉసిరి పిప్పింట రణపాల మొదలైన మొక్కలను నాటారు ఈ జాబితాలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్క ప్రయోజనాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు, వాటి సంరక్షణ కోసం ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజల్లో, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ఆయుర్వేద ఔషధాలపై అవగాహన పెంచే లక్ష్యంతో ఐఈఈఆర్డి చేస్తున్న సేవను అధికారులు అభినందించారు.



# విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్





**పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం వేల్పూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్**

**ఇంటింటికీ తిరిగి ఏడాదిలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించిన మంత్రి టి.జి భరత్**

తనుకు/కర్నూలు(విజయ సారథి):ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ లీడర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం వేల్పూరు గ్రామంలో ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏ ఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల అకౌంట్లో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఏడాదిలోనే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టబడులు వచ్చాయన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశలో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు వయస్సును ఉద్దేశించి వైసిపి నేతలు ఇష్టానుసారంగా మాట్లాడడం బాధాకరమన్నారు. తమ పార్టీలో కిందిస్థాయి కార్యకర్త నుంచి పై నాయకులు వరకు అందరూ క్రమశిక్షణతో ఉంటారని.. వైసిపి నేతల మాదిరిగా ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయరన్నారు. వైయస్ జగన్ వందేళ్లపాటు బ్రతకాలని తాము కోరుకుంటున్నామని.. ఎందుకంటే ఆయన ఉన్నన్ని రోజులు ప్రజలు తమ వైపే ఉంటారని, తమ ప్రభుత్వం తప్పకుండా ఇలాగే కొనసాగుతుందన్నారు. తనుకు నియోజవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అరెమిల్లి రాధాకృష్ణ ఎంతో కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ ప్రాంతంలో ఎమ్.ఎస్. ఎమ్.ఈ పార్కు ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు పలు అభివృద్ధి పనులకు మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రేట్ విజన్ సొసైటీ ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా జయంతి వేడుకలు

పీలేరు(విజయ సారథి):గ్రేట్ విజన్ సొసైటీ పీలేరు అన్నమయ్య జిల్లా ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.యస్. బాబు, ప్రాజెక్ట్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ డాక్టర్ తలారి రఘునాథ్ మరియు సంస్థ సిబ్బందిలోని మహిళలు ప్రముఖంగా పాల్గొన్నారు. డాక్టర్ బాబు మాట్లాడుతూ, "మానవ హక్కులు, సామాజిక న్యాయం మరియు సమాజ సేవ కోసం నెల్సన్ మండేలా చేసిన త్యాగాలను ఈ వేడుకల ద్వారా గౌరవిస్తున్నాము. యువతలో అతని విలువలను ప్రోత్సహించడమే మా ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు. డాక్టర్ రఘునాథ్ కూడా మండేలా జీవితం నుండి పాఠాలు తీసుకోవాలని సభ్యులను ప్రేరేపించారు. ఈ సందర్భంగా సంస్థ సిబ్బంది డీఎస్టీ సంఘ సభ్యులు సి.సి.పీ.లు రాణమ్మ ప్రసన్నకుమారి భాస్కర్ నాయక్ అశోక్ నాయక్ జ్యోతి, సుజాత మరియు మహిళలు నెల్సన్ మండేలా జీవితానికి సంబంధించిన ప్రేరణాత్మక ప్రసంగాలు, సామాజిక సమస్యలపై చర్చలలో పాల్గొనడం ద్వారా కార్యక్రమానికి సుసంపన్నత నిచ్చారు. సామరస్యం, సమానత్వం మరియు సేవాభావనలను బలపరిచేందుకు సంస్థ ఇలాంటి కార్యక్రమాలను సాగిస్తుందని సంస్థ తెలిపింది. ప్రత్యేకం:మహిళా సిబ్బంది సమష్టిగా పాల్గొనడం ద్వారా సంస్థ లింగసమానత్వానికి ఇచ్చే ప్రాధాన్యతను ఈ కార్యక్రమం ప్రదర్శించింది. కీలకాంశాలు:- స్థానం: పీలేరు (అన్నమయ్య జిల్లా) - నిర్వాహకులు: గ్రేట్ విజన్ సొసైటీ.- ప్రముఖ పాలకులు: డా. జి.వి.యస్. బాబు (వ్యవస్థాపక అధ్యక్షులు), డా. తలారి రఘునాథ్ (ప్రాజెక్ట్ అడ్వైజర్) - ప్రత్యేకత: సంస్థ మహిళా సిబ్బంది చురుకుగా పాల్గొనడం.

## తిరుపతి ప్రెస్ క్లబ్ మరమ్మతులకు సహాయసహకారాలు

**తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి**



తిరుపతి(విజయ సారథి):తిరుపతి ప్రెస్ క్లబ్ కమిటీ ప్రెస్ క్లబ్ భవన రేనోవేషన్ చేపట్టింది. ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు శుక్రవారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రెస్ క్లబ్ విచ్చేసి పనులను పరిశీలించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి,సెక్రెటరీ బాలచంద్ర లు ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న పనులను వివరించారు. ప్రెస్ క్లబ్ లో డయాస్ (స్టేజి) నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. మీడియా మిత్రులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందించడానికి ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కవిటం మెయిన్ రోడ్డు పై బిందెలతో గ్రామస్తులు నిరసన

**తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు**



పోడూరు జులై 18 పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కవిటనీ బ్రిడ్జ్ మెయిన్ రోడ్డుపై గ్రామస్తులు త్రాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామంటూ కవిటం నాలుగు కూడలి సెంటర్లో ఖాళీ బిందెలతో కాలనీవాసులు నిరసన కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు గత నాలుగు రోజుల నుండి నీరు రాక ఇబ్బంది పడుతున్న నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులుపచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో గోదావరి జలాలు ఉప్పొంగుతున్న గ్రామాలలో త్రాగు నీరులేక "నీటి కటకట.త్రాగడానికి కాలనీ వాసులకు కనీసం ట్యాంకుల ద్వారా అయినా నీటి సరఫరా చేయమని వేడుకుంటున్నా అధికారులు స్పందించడం లేదు.అంటూ ఆందోళన తప్పని పరిస్థితుల్లో ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కవలసిన పరిస్థితి వచ్చింది

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయండి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు(విజయ సారథి):అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇసుక రవాణాను పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. హంద్రీ, తుంగభద్ర ఇసుక రీచ్ ల వద్ద అక్రమ ఇసుక రవాణా కు సంబంధించి పత్రిక లలో ప్రతికూల వార్తలు వస్తున్నాయని, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేస్తున్నారా, లేదా అని కలెక్టర్ రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆరా తీశారు. అక్రమ ఇసుక రవాణా పై వస్తున్న వార్తలపై వెంటనే స్పందించి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు వెళ్లి తనిఖీ చేసి కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నప్పటికీ విఆర్ఓ



లు సమాచారం ఇవ్వకుండా ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.. ఇప్పటి వరకు అక్రమ ఇసుక రవాణా కు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు.సమావేశంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు టౌన్ డి.ఎస్.పి బాబు ప్రసాద్, ఆర్టీవో భరత్, మైనింగ్ అధికారి రవి చంద్, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కిషోర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పి 4 సర్వే పక్కాగా చేయాలి

మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం మండలంలో పీ-4 విధానంపై పక్కాగా సర్వే చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ సూచించారు. ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం మంత్రాలయం ఎమ్మార్వో కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు మాట్లాడుతూ.. పీ-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చాల్సి ఉందన్నారు. జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందిని గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టాలన్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం, కాపాడిన సిబ్బంది



.మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదిలో గోపురప్ప నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది మనోహర్ అతడిని కాపాడారు. ఎస్డిఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ మహేంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగభద్ర నదిలో పెట్రోలింగ్, రెస్క్యూ విధులు నిర్వహిస్తున్న సందర్భంలో నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడని తెలిపారు. అతడిని కాపాడి స్థానిక ఎస్సై శివాంజల్‌కు అప్పగించామన్నారు.

## డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలి

**డిడిసి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా**

నంద్యాల(విజయ సారథి):డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలనిజిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా వైద్యాధికారులకు సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా కలెక్టరేట్లోని తమ ఛాంబర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం కింద వైద్యాధికారులతో డిడిసి(జిల్లా డిసిప్లెనరీ కమిటీ) సమావేశం నిర్వహించారు.



సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైద్య అభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఐవిఆర్ ఎస్, మెడికల్ ఆడిట్ కేసులకు సంబంధించి రివ్యూ చేయడం జరిగింది. ఇందులో మొత్తం 12 కేసులకు సంబంధించి ఆసుపత్రుల ద్వారా అమౌంట్ రోగులకు ఇప్పించడం జరిగింది.ఇకనుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలన్నారు. అలా చేయని యెడల పదింతల వరకు అపరాధ రుసు విధించడం తోపాటు ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.ఇందులో ముఖ్యంగా కన్సల్టేషన్ చార్జీలు, ఇన్వెస్టిగేషన్ కు, ఎమర్జెన్సీ సేవలు పూర్తి ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ.లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై.రూపేంద్ర నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



చింతలపూడి: జూలై 18. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వేలాది మంది ఇంజనీరింగ్ సిబ్బంది ( వాటర్ వర్క్స్, పంప్ ఆపరేటర్స్, విద్యుత్ లైటింగ్ వ్యవస్థ మరియు ఇంజనీరింగ్ వ్యవస్థలలో) అనేక రకాల పనిచేస్తున్న కార్మికులకు గత ప్రభుత్వం ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చినటువంటి హామీలను నేటి వరకు అమలు చేయకపోవడానికి, జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు అన్ స్కిల్డు స్కిల్డు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం, గత ప్రభుత్వం విధించినటువంటి మంత్రుల కమిటీ నిర్ణయాలను నేటి వరకు అమలు చేయకపోవడానికి నిరసనగా 12వ తేదీ అర్ధరాత్రి నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అనేక చోట్ల సమ్మె బాట పట్టారని ప్రభుత్వం మొండి వైఖరితో సమ్మెను పరిష్కరించవలసింది పోయి మెండిగా వ్యవహరిస్తుందని దీనికి నిరసనగా గత రెండు రోజుల నుండి చింతలపూడి వాటర్ వర్క్ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి ధరించి నిరసన తెలియజేస్తున్నామని ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్య పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా తాము కూడా సమ్మెలోకి వెళ్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఉ ఎంప్లాయిస్ ఫెడరేషన్. సిఐటియు. చింతలపూడి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ఉ. నాగరాజు, ు. విజయ రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమ్మెలోకి వెళ్ళినట్లయితే ప్రజలకు గల అసౌకర్యానికి ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని గత రెండు సంవత్సరాల కాలం నుండి ప్రభుత్వానికి మొరపెట్టుకున్న తమ సమస్యలు పరిష్కారం అవ్వట్లేదు అని యూనియన్ నాయకులు ఎస్ డి సలీం , ఎ. సత్యం, ఎ. నాగరాజు, మనోహర్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

**పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప**

కాకినాడ(విజయ సారథి):గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వంఅధిక ప్రాధాన్యత కల్పిస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం మరలావా,తూర్పు పాకల గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి అయిన సందర్భంగా గడచిన సంవత్సరంలో సుపరి పాలనలో తొలడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామంలో ఎటువంటి సమస్యలను తీర్చడానికి తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిన్న రాజప్ప ఈసందర్భంగా తెలిపారు. తాజాగాగ్రామ ల అభివృద్ధికి 25 లక్షల రూపాయలు చొప్పున నిధులు కేటాయించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు . గతప్రభుత్వ మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు నివాసయోగ్యాలకు అనువుగా లేకపోవడంతోవాటిని క్యాబినెట్ లో పెట్టి రద్దు చేసిన తర్వాత నూతనంగా ఇళ్ల స్థలాల పట్టాలు మన ప్రభుత్వంలో మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు నిమ్మకాయల రంగనాథ్ కూడా తండ్రి చినరాజప్ప కూడా ఇంటింటికి తిరిగి గత సంవత్సర కాలం నుండి జరిగిన అభివృద్ధి పథకాలపై గ్రామస్తులకు కరపత్రాల ద్వారా వివరించారు .తూర్పు పాకల సర్పంచ్ పడాల అన్నపూర్ణ వీర రాఘవ, ఉప సర్పంచ్ యాళ్ల రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, టిడిపి నాయకులు ఎలిశెట్టి నాని,పెద్ది గణపతి, కె.గాంధీరావు, ఇళ్ల ప్రకాశరావు, ఖాతాబుజ్జి, ఖాతా పెదరాయలు, బొదిరెడ్ల చంటిబాబు, గొంచాల వీరబాబు, రాయి ప్రవీణ్ కుమార్, కోన సూర్యనారాయణ, గడ్డం సూరిబాబు మరియుకూటమి నాయకులు అధిక సంఖ్యలో గ్రామస్తులు తదితరులుపాల్గొన్నారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com